

ప్రతి దినపత్రిక

# సూర్య

గుంటూరు పల్నాడు

www.suryaa.com

బుధవారం 21 జనవరి 2026 - పేజీలు 11


## మార్చిలోపే ఆస్తి పన్ను చెల్లించాలి

**కమిషనర్ కె.మయూర్ అశోక్**



**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** ఆస్తి పన్ను చెల్లించడానికి మార్చివరకు వేచి ఉండకుండా చెల్లించాలి...కమిషనర్ కె.మయూర్ అశోక్ 2025-26 రెండో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున ఆస్తి, నీటి, ఖాళీ స్థల పన్నులు చెల్లించాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, గుంటూరు నగర ప్రజలు తమ ఆస్తి, ఖాళీ స్థల, నీటి కుళాయి చార్జీలను వెంటనే చెల్లించాలన్నారు. పన్నులను జిఎంసి ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయంల్లోని క్యాష్ కౌంటర్లలో చెల్లించవచ్చన్నారు. కావున నగర పాలకసంస్థకు చెల్లించవలసిన ఆస్తి పన్ను, నీటి పన్ను, ఖాళీ స్థలం పన్ను, నీటి మీటర్ చార్జీలు, డి అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్ లు చెల్లించవచ్చున్నారు. బకాయిదార్లు మార్చి వరకు వేచి ఉండకుండా చెల్లించాలని, ఈ నెల 1 నుండి ప్రస్తుత అర్ధ సంవత్సరంకు కూడా వడ్డీ నమోదు అయిందని, కనుకవెంటనే పన్ను చెల్లించాలన్నారు. ఇప్పటికే వార్డ్ అడ్మిన్ కార్యదర్శులకు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, అధికారులు, డిప్యూటీ కమిషనర్లకు టార్గెట్ లు విధించామన్నారు. వసూళ్ళపై సమీక్ష చేస్తామని, అవసరమైతే సెలవు రోజుల్లో

మిగతా 2 లో..

# వెంకయ్యా.. ఎమ్మెల్యే పేరు బదనామ్ చేయకయ్యా..!



- కూటమి కోసం పని చేసాం... తప్పుకుంటాం... సంపాదించుకుంటాం...!
- గుంటూరు రూరల్ లో యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు...
- మాట వినకుంటే తప్పని బెదిరింపులు...
- కన్నెత్తి చూడొద్దంటూ మైనింగ్ అధికారులకు హుకుం..
- అనుబంధ లేని గ్రామాలు తవ్వకాలను ప్రోత్సహిస్తున్న రెవిన్యూ అధికారులు

"గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్: వెంకయ్యా... ఎమ్మెల్యే పేరు బదనామ్ చేయకయ్యా...!!? అంటూ కూటమి ప్రభుత్వంలోని సీనియర్ నాయకులు ఎంతగా చెప్పినా సదరు క్లస్టర్ ఇన్చార్జిల తీరు మారడం లేదు. ఏ పని చేసిన శృతిమించి రాగానే పడితే తీవ్రంగా నష్టపోతామని సీనియర్ తెదేపా నాయకులు ఎంతగా వారించిన వినడం లేదని తెలుస్తోంది."



## పల్నాడు జిల్లా నూతన జాయింట్ కలెక్టర్‌గా సంజన సింహా బాధ్యతలు

**జిల్లా కలెక్టర్ కృతిక శుక్లాను మర్యాదపూర్వ కంగా కలిసిన జాయింట్ కలెక్టర్ సంజన సింహా**

నరసరావుపేట రూరల్ మేజర్ న్యూస్ : పల్నాడు జిల్లాకు నూతన జాయింట్ కలెక్టర్?గా సంజన సింహా మంగళవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆమె జిల్లా కలెక్టర్ కృతిక శుక్లాను మర్యాదపూర్వకంగా కలిసి, జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పరిపాలన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సంజన సింహా మాట్లాడుతూ ప్రజాసేవలో పారదర్శకత, వేగవంతమైన పరిపాలనకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ కార్యక్రమాలు సమర్థవంతంగా ప్రజలకు

2 లో



## పశు ఔషధి విక్రయ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

2 లో

## రేపే మంగళగిరి ప్రీమియర్ లీగ్-4 ఆఖరి పోరు

2 లో



## గణతంత్ర వేడుకల ఏర్పాట్లు పరిశీలించిన ఉన్నత అధికారులు



**గుంటూరు, కలెక్టరేట్ మేజర్ న్యూస్:** రాయిపూడిలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి గణతంత్ర వేడుకల ఏర్పాట్లను సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు - ఇన్స్పెక్టర్ జనరల్ రాజకుమారి, గుంటూరు జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్, సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్.విశ్వనాథన్ తదితర ఉన్నత అధికారులతో కలిసి మంగళవారం

2 లో

# గణతంత్ర వేడుకల ఏర్పాట్లు పరిశీలించిన ఉన్నత అధికారులు

మొదటి పేజీ తరువాయి

పరిశీలించారు. రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, మంత్రులు విచ్చేసి మార్గాలు, కూర్చునే ప్రదేశాలు, పెరేడ్ నిర్వహించే ప్రక్రియ తదితర అంశాలను విపులంగా పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామల రావు మాట్లాడుతూ ఏర్పాట్లలో ఎటువంటి లోపాలు ఉండరాదని స్పష్టం చేశారు. అతిథులు వేదిక వద్దకు వచ్చే మార్గాలు, పార్కింగ్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని ఆదేశించారు. తాగు నీరు సరఫరా, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఆయా ప్రదేశాలకు వెళ్ళే సూచిక బోర్డులు విధిగా ఏర్పాటు చేయాలని సూచించారు. శాఖల అభివృద్ధిని తెలియజేసే శకటాలను ఇన్స్పెక్టర్ జనరల్ రాజకుమారి మాట్లాడుతూ పెరేడ్ ఏర్పాట్లను వివరించారు. జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లా అధికారులకు విధులను కేటాయించామని, సంబంధిత అధికారులు ప్రధాన కార్యాలయంతో అనుసంధానం చేసుకుంటూ విధులు నిర్వహించాలని ఆదేశించినట్లు తెలిపారు. తాగు నీరు, అల్పాహారం, పారిశుధ్యం నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసామని వివరించారు. పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ మాట్లాడుతూ పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. తొమ్మిది వందల మంది పోలీసు సిబ్బందిని ఇందుకు కేటాయించామని చెప్పారు. రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, మంత్రులు విచ్చేసి మార్గాలు, ప్రజలు వచ్చే మార్గాలు, పార్కింగ్ ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని తెలిపారు.సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్.విశ్వనాథన్ మాట్లాడుతూ 21 శాఖలు తమ అభివృద్ధిని తెలియజేసే శకటాలను ప్రదర్శించనున్నాయని



తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ఎస్పీ ఆరిఫ్, సి.ఆర్.డి.ఏ అదనపు కమిషనర్ భార్గవ తేజ, రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస రావు, ప్రోటోకాల్ సంచాలకులు మోహనరావు, అదనపు ఎస్పీ హనుమంతు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వెంకయ్యా... ఎమ్మెల్యే పేరు బదనామ్ చేయకయ్యా..!

మొదటి పేజీ తరువాయి

కూటమి ప్రభుత్వంలో పని చేస్తున్నాం. గిట్టని వారు ఉంటారు. నచ్చని వారు ఉంటారు. అందర్నీ కలుపుకుపోవాలి. ఆ పదిమందికే పట్టం కడితే కుదరదు. అందరు సహకారం ఉంటేనే మనగలం. లేకుంటే అప్రతిష్ట పాలు కాక తప్పదు. అంటూ ఓ ప్రజా ప్రతినిధి పదేపదే పార్టీ క్యాడర్ కు హితబోధ చేస్తున్నప్పటికీ నోట్ల కట్టలతో కళ్ళు మూసుకుపోయిన క్యాడర్ కు ఇవేమీ పట్టడం లేదు. సదరు ప్రజా ప్రతినిధి ముందు వంగి వంగి నమస్కారాలు పెట్టి ఎక్కడ లేని ప్రేమ ఆప్యాయత అనురాగం విధేయత చూపెడుతూ ఆయన వెనుక గ్రావెల్ కోసం గోతులు తవ్వుతూ సదురు ప్రజాప్రతినిధికి ఉన్న మంచి పేరును చెడగొట్టడమే పనిగా పదిమంది క్లస్టర్ ఇంచార్జిలు పెట్టుకున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. "జాగ్రత్తగా పని చేసుకోండి. పార్టీకి చెడ్డ పేరు తీసుకురావద్దు. ఎవరిని నొప్పించవద్దు బెదిరించొద్దు." అని చెప్పిన పాపానికి ఆయన సదరు ప్రజాప్రతినిధి 50 ఏళ్లుగా కాపాడుకున్న మంచి పేరును కొందరు టిడిపి నాయకులు విధేయత కలిగిన నాయకుల వలె ముసుగు కప్పుకుని అత్యంత దుర్మార్గానికి పాల్పడుతున్నారని విమర్శలు నియోజకవర్గంలో ఉన్నాయి. ఆ పదిమంది గురించి ఎంత చెప్పినా తక్కువే అనే విషయం అందరికీ తెలిసిన సదురు ప్రజాప్రతినిధికి తెలియకపోవడం శోచనీయం.



### డంపింగ్ యార్డ్ సమీపంలోనే గ్రావెల్ క్వారీ...

గుంటూరు నగరపాల సంస్థ పరిధిలోని జిందాల్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ సమీపంలోనే అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నారు. ఈ వైపుగా ప్రభుత్వ అధికారులు అప్పుడప్పుడు సంచరిస్తూ ఉంటారు. స్థానిక విఆరచవతీతీచ లకు ఈ విషయం తెలిసిందే. అక్రమ గ్రావెల్ తవ్వకాల గురించి సంబంధిత రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ వారు యాక్షన్ తీసుకోకపోవడంతో విఆర్వోలు ఏమి చేయలేక నిశ్శాస్థితిలో ఉండిపోయినట్లుగా తెలిసింది. అక్రమ తవ్వకాల లో రెవిన్యూ విభాగానికి కూడా కొంత మొత్తం చెల్లిస్తున్నట్లుగా నిర్వాహకులు బహిరంగంగానే చెబుతున్నారు.

### ఎకరం రూ.35 లక్షలకు కొనుగోలు చేస్తాం.. మా ఇష్టం..

గుంటూరు పరిసర గ్రామాలలో కొండ చర్యల వెంట పోరంబోకు ప్రభుత్వ అసైన్డ్ భూములను గుర్తించి గ్రావెల్ అక్రమ తవ్వకాలు చేస్తున్నారని తెలుస్తోంది. ఇప్పటివరకు సుమారు 20 ఎకరాలలో ఎకరా 35 లక్షల చొప్పున కొనుగోలు చేసి గ్రావెల్ తవ్వకాలు జరిపినట్లుగా వినికిడి. ఈ విషయమై ఓ అక్రమ క్వారీయింగ్ చేస్తున్న ఓ ప్రజా ప్రతినిధి ముఖ్య అనుచరుడిని ప్రశ్నించగా మాకు ఊరికే రావడం లేదని పొజిషన్లో ఉన్నవారికి ఒక్కొక్కరికి ఎకరానికి 35 లక్షలు చొప్పున చెల్లించిన పెదపనే గ్రావెల్ క్వారీయింగ్ చేస్తున్నామని వివరణ ఇవ్వడం కొసమెరుపు. అంటే ఇప్పటివరకు సుమారు 20 ఎకరాలలో క్వారీయింగ్ జరిగినట్లుగా చెప్పుకుంటే నేనే పద్యంలో ఏడు కోట్ల రూపాయల వరకు గ్రావెల్ తవ్వకునేందుకు అనుమతి ఇచ్చిన భూమి యజమానులకు చెల్లించినట్లుగా సదరు ప్రజా ప్రతినిధి ముఖ్య అనుచరుడు చెప్పిన లెక్కలు స్పష్టం చేస్తున్నాయి.

### కూటమి కోసం పని చేసాం... తవ్వుకుంటాం... సంపాదించుకుంటాం...!!

కూటమి పర్వతం గెలుపు కోసం పనిచేశాం.. గ్రావెల్ తవ్వుకుంటాం... అమ్ముకుంటాం.. కోట్లు గడిస్తాం.. ప్రభుత్వానికి లేని బాధ, అధికారులు లేని చింత మీడియా మీకెందుకు అయ్యా అంటూ కూటమిలోని చోట నాయకులు బహిరంగంగానే అవాకులు,చవాకులు పేలుతున్నారు. గుంటూరు రూరల్ మండలం పరిధిలోని పేరేచర్ల, వెంగళాయపాలెం, నాయుడుపేట, ఓబుల నాయుడుపాలెం, దాసరి పాలెం, చౌడవరం, పొత్తూరు, చిన్నకొండ్రుపాడు, ప్రత్తిపాడు మండలంలోని పలు గ్రామాలలో రాష్ట్ర, జాతీయ రహదారుల వెంట ఉన్న గ్రామాలలో అడ్డగోలుగా గ్రావెల్ క్వారీలు జరుగుతోంది. అయినప్పటికీ ప్రశ్నించేవారు లేరు. ఈ గ్రామాల పరిధిలో గత రెండేళ్ల కాలంలో గ్రావెల్ తవ్వకాల ద్వారా కోట్లాది రూపాయలు గడిస్తున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### మీడియాపై బెదిరింపులు...

గుంటూరు రూరల్ మండలంలో అక్రమ క్వారీయం చేసే కొందరు కూటమి ప్రభుత్వంలోని చోటా నేతలు మీడియా వ్యక్తుల పట్ల బెదిరింపులకు పాల్పడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. మీడియా వ్యక్తులు అక్రమాలను చూసి అయిన కాడికి అందుకొని పోతే మంచిదే... కాదంటే సదరు మీడియా వ్యక్తుల కుటుంబ వివరాలను తెలుసుకొని బెదిరింపులకు పాల్పడుతున్నట్లుగా తెలిసింది. ఈ కారణంగా కొందరు మీడియా వ్యక్తులు అమ్ముడుపో తుండగా, మరికొందరు భయంతో ఆ వైపు కన్నెత్తి చూడడం లేదని, ఇంకొందరు మనకెందుకులే అని ఊరుకుంటున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి.

### అక్రమ గ్రావెల్ క్వారీ వైపు కన్నెత్తి చూస్తే ఊరుకోం అంటున్నారు : మైనింగ్ శాఖలో ఓ ఉద్యోగి ఆవేదన

కూటమి ప్రభుత్వంలోని కొందరు నాయకులు గుంటూరు రూరల్ మండలంలో అక్రమ అక్రమ గ్రావెల్ క్వారీయింగ్ చేస్తున్నారని ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతున్నారని గుంటూరు మైనింగ్ శాఖ కార్యాలయంలో పనిచేసే ఓ ఉద్యోగి విలేకరుల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం గవర్నమెంట్లో ఉన్న వ్యక్తులు ఏం చేసినా చలామణి అవుతుందని అహంకారంతో వ్యవహరిస్తున్నారని, ఆ తదుపరి ప్రభుత్వం మారగానే తామే కేసుల్లో ఇరుక్కుంటామని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులమనే విషయాన్ని మరిచి కన్నెత్తి చూస్తే ఊరుకోం అనే హెచ్చరికలను జారీ చేయడం పట్ల తీవ్ర మనస్థాపానికి గురవుతున్నామని వాపోయారు.

# మార్చిలోపే ఆస్తి పన్ను చెల్లించాలి

మొదటి పేజీ తరువాయి

కూడా కౌంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఆన్ లైన్ ద్వారా cdma.ap.gov.inలో, పురమిత్ర యాప్ ద్వారా కూడా చెల్లింపు చేయవచ్చున్నారు. పన్ను చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలన్నారు.

# పశు ఔషధి విక్రయ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

మొదటి పేజీ తరువాయి

**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్:** జిల్లాలో పశు ఔషధి విక్రయ కేంద్రాలు ఏర్పాటుకు నిర్దేశిత మార్గదర్శకాలు ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పశుసంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం లో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అధ్యక్షతన పశు ఔషధి కేంద్రాల ఏర్పాటుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు సరసమైన ధరలకు మంచి నాణ్యత గల జనరిక్ మందులను అందించడం కోసం పశు ఔషధి విక్రయ కేంద్రాలను ప్రతి రెవెన్యూ డివిజన్లో ఏర్పాటుకు మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. అర్హత ఆసక్తి ఉన్న వారి నుంచి ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించి పశు ఔషధి విక్రయ కేంద్రాల ఏర్పాటు పై ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ జెడి డా కేవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ సహకార సొసైటీలు, బి ఫార్మసీ లేదా డీ ఫార్మసీ డిగ్రీ కలిగిన వారు పశు ఔషధి విక్రయ కేంద్రాల ఏర్పాటుకు అర్హులని తెలిపారు. జిల్లాలో ప్రాథమికంగా గుంటూరు, తెనాలి రెవిన్యూ డివిజన్ పరిధిలో పశు ఔషధి విక్రయ కేంద్రాల ఏర్పాటు చేయనున్నమని తెలిపారు. కనీసం 120 చదరపు అడుగుల స్వంత స్థలం లేదా అద్దె స్థలం ఉండాలని, డ్రగ్ సేల్ లైసెన్స్ కలిగి ఫార్మసీస్ట్ రిజిస్ట్రేషన్ వివరాలు ఉండాలని చెప్పారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు https://pashuaushadhi.dahd.gov.,H□ లో దరఖాస్తులు నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో సహకార శాఖ అధికారి వీరాచారి, ,డ్రగ్ కంట్రోలర్ లక్ష్మణ్, జిల్లా పశుసంవర్ధక శాఖ ఏడి డా. మోహనరావు పాల్గొన్నారు.

### పల్నాడు జిల్లా నూతన జాయింట్ కలెక్టర్‌గా

# సంజన సింహ బాధ్యతలు

మొదటి పేజీ తరువాయి

చేరేలా అధికారులతో సమన్వయంతో పనిచేస్తామని చెప్పారు. జిల్లా పరిపాలనలో కీలక బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పలువురు జిల్లా అధికారులు, సిబ్బంది జాయింట్ కలెక్టర్ సంజన సింహకు శుభాకాంక్షలు తెలిపారు.

# రేపే మంగళగిరి ప్రీమియర్ లీగ్-4 ఆఖరి పోరు

**– ఫైనల్ కు చేరిన వల్లభనేని వెంకట్రావు టీమ్, సీకే వారియర్స్**

మొదటి పేజీ తరువాయి

**మంగళగిరి, మేజర్ న్యూస్:** మంత్రి నారా లోకేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకోని నారా లోకేష్ క్రీడా ప్రాంగణం(బోగి ఎస్టేట్స్)లో జరుగుతున్న మంగళగిరి ప్రీమియర్ లీగ్ -4 పోటీలు ఆఖరి దశకు చేరాయి. ప్రీమియర్ లీగ్-4లో మొత్తం 128 జట్లు తలపడగా అద్భుతంగా రాణించిన వల్లభనేని వెంకట్రావు యూత్, సీకే వారియర్స్ జట్లు ఫైనల్ కు చేరాయి. బుధవారం మధ్యాహ్నం 1 గంటకు ఫైనల్ మ్యాచ్ జరగనుంది. మూడవ స్థానం కోసం మురళీ లెవన్ పార్క్ రోడ్ వర్సెస్ తోటాద్రి గ్లాడియేటర్స్ జట్లు తలపడనున్నాయి. ఫైనల్ మ్యాచ్ కు సంబంధించి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లను అద్భుతంగా పూర్తి చేశారు. ఫైనల్ మ్యాచ్ కు ముఖ్య అతిథులుగా భారత మాజీ క్రికెటర్ వెంకటపతిరాజు, ఎంపీ సానా, ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, కాకర్ల సురేష్, ఎం.ఎస్ రాజు, శాప్ ఛైర్మన్ రవినాయుడులు హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు. ప్రీమియర్ లీగ్-4లో పాల్గొన్న 128 జట్లకు మంత్రి నారా లోకేష్ సహకారంతో క్రికెట్ కిట్లు పంపిణీ చేస్తారు. ఈవెంట్ స్పాన్సర్లుగా సాయి పావని కన్ స్ట్రక్షన్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, బిజ్ 51, సిగ్నేచర్ డైన్, సెలారా, శ్రీ మండవ జ్యువలర్స్, తాడేపల్లి మెడ్ స్టార్ హాస్పటల్స్, హోటల్ డి దేవ్, సోనోవిజన్,హైపర్ ప్యాక్ ప్రైవేట్ లిమిటెడ్, కోకోకోలా, వీ వైబ్ ఈవెంట్స్ వ్యవహరించనున్నాయి. ప్రతి మ్యాచ్?ను గోపీ టీవీ యూట్యూబ్ ఛానల్, వి డిజిటల్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేశారు. ప్రీమియర్ లీగ్ సీజన్-4 పోటీలలో ప్రథమ బహుమతి కింద రూ.3 లక్షలు మంగళాద్రి డెవెలపర్స్, ద్వితీయ బహుమతి కింద రూ 2 లక్షలు మంచికలపూడి వైష్ణవి, తృతీయ బహుమతి కింద రూ.లక్ష నగదును



వెలగపూడి కిషోర్ సహకారంతో అందించనున్నారు. అలాగే ప్రతి మ్యాచ్?కి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ రూ.3 వేలు జవ్వాది కిరణ్ చందు, ప్రతి మ్యాచ్? టాస్ విన్నర్?కు సిల్వర్ కాయిన్, అలాగే ఫైనల్ మ్యాచ్ టాస్ విన్నర్?కు గోల్డ్ కాయిన్ రేవతి జ్యూయలరీ, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ కింద ఎలక్ట్రానిక్ బైక్ వల్లభనేని భార్గవ్, బ్యాట్స్ మెన్ ఆఫ్ ది సిరీస్ రూ.25 వేలుతో పాటు ఎలక్ట్రికల్ బై సైకిల్ కాసరనేని జస్వంత్, బౌలర్ ఆఫ్ ది సిరీస్ రూ.25 వేలుతో పాటు బై సైకిల్ గుత్తా కిషోర్, ఫీల్డర్ ఆఫ్ ది సిరీస్ రూ.25 వేలతో పాటు బైసైకిల్ తాడిబోయిన మహేష్, వికెట్ కీఫర్ ఆఫ్ ది సిరీస్ రూ. 25 వేలుతో పాటు బై సైకిల్ షేక్ ఇంతియాజ్?లు అందించనున్నారు.

# నిజాన్ని నిర్భయంగా ప్రచురించే పత్రిక నేటి దినపత్రిక సూర్య





**పెదకాకాని మేజర్ న్యూస్:** నిజాన్ని నిర్భయంగా ప్రచురించే పత్రిక నేటి దినపత్రిక సూర్య అని వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలజీ యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ వాసిరెడ్డి విద్యాసాగర్ పేర్కొన్నారు మంగళవారం నేటి దినపత్రిక సూర్య




నూతన సంవత్సర క్యాలెండర్ను విద్యాసాగర్ ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక స్పృహతో సమాజంలో జరుగుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో పాటు ప్రజా సమస్యలను నిర్భయంగా నేటి దినపత్రిక సూర్య ప్రచురించడం అభినందనీయమని అన్నారు అనతి కాలంలోనే ప్రజల మనోభావాలకు విలువనిస్తూ ప్రజా జీవితంలో ఒక భాగంగా ప్రతి అక్షరం ప్రజల పక్షంగా నిలుస్తున్న నేటి దినపత్రిక సూర్య పనితీరు అభినందనీయమని అన్నారు సిబార్ దంత వైద్య కళాశాల డీన్ డాక్టర్ లింగమనేని కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ఆర్థిక సామాజిక వైజ్ఞానిక ఆధ్యాత్మిక విషయాలలో ప్రజలను ఎప్పటికప్పుడు చైతన్య పరుస్తూ ఉత్తేజ భరితమైన కథనాలతో ప్రచురితమవుతున్న నేటి దినపత్రిక సూర్య మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు పెదకాకాని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి ఆలయ దేవస్థానం ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు చేరవేస్తూ నేటి దినపత్రిక సూర్య పాఠకులకు మరింత చేరువవుతుందని అన్నారు పెదకాకాని గ్రామపంచాయతీ కార్యదర్శి జి ప్రసాదరావు మాట్లాడుతూ క్షేత్రస్థాయి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న నేటి దినపత్రిక సూర్య పనితీరు అభినందనీయమని అన్నారు. పెదకాకాని సిఐ నారాయణస్వామి మాట్లాడుతూ నేటి దినపత్రిక సూర్య సామాజిక స్పృహతో కథనాలు ప్రచురించడం అభినందనీయమని అన్నారు.



## ప్రతి రైతు పంట నమోదు చేపించుకోవాలి

**– పాత మల్లయ్యపాలెం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం**

**ప్రతిపాడు మేజర్ న్యూస్ :** ప్రత్తిపాడు మండలంలోని పాత మల్లయ్యపాలెం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏ. డి.ఏ. ఎన్. మోహన్ రావు మండల వ్యవసాయాధికారి షేక్. సుగుణ బేగం పాలుగోన్నారు. ఏ.డి.ఏ. ఎన్.మోహన్ రావు మాట్లాడుతూ రైతులందరు వారి పొలంలో ఏ పంట వేశారో రైతు సేవా కేంద్రాలకు వచ్చి తప్పనిసరిగా పంట నమోదు చేపించుకోవాలి అని తెలియజేశారు. ఈ క్రాప్ నమోదు చేపించుకొనే రైతులకు 3దశలో వారికి ఆధార్ కు లింక్ ఐయినా మొబైల్ నెంబర్ కు సందేశం వస్తుంది. మొదటి సందేశం ఈ పంట నమోదు ఏ రోజు చేస్తామో అనే తేదీ గురించి తెలుపుతుంది. రెండోవ సందేశం పంట నమోదు చేసిన తరువాత ఆ రైతుకు పంట నమోదు జరిగిన వివరాలు తెలియజేస్తుంది. మూడోవా సందేశం రైతుల పంట వివరాలు సరైనవేనా అని చూసుకోవడానికి తెలుస్తుంది. అదేవిధంగా రైతు సేవా కేంద్రాలలో రైతులు 11అంకెల గల విశిష్ట నెంబర్ ని రిజిస్ట్రేషన్ చేపించుకోవాలి అని తెలియజేశారు. అదేవిధంగా రైతులు ఫార్మర్ యాప్ ని డౌన్లోడ్ చేసుకోవాలని తెలియజేయడం జరిగింది. శనగ, మొక్కజొన్న పంటల యాజమాన్య పద్ధతుల గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులు, వి.యచ్. ఏ. గణేష్ పాలుగొనడం జరిగింది.

# నాడు అధికారం కోసం అలవి కాని హామీలు

**– నేడు అసలు అమలే కాని పథకాలు – నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు**



**గుంటూరు జిల్లా పరిషత్ మేజర్ న్యూస్ :** ఎన్నికల సమయంలో ఎలాగైనా అధికారంలోకి రావాలన్న పదవీ వ్యామోహంతో ఇచ్చిన ఎన్నో పథకాలు అమలు చేయడం చేతకాక గత ప్రభుత్వంపై నిందలు వేయడం నీతిమాలిన పని అని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు నిందించారు. టీడీపీ కూటమి ప్రభుత్వ తీరు "ఆడలేక మద్దెల ఓడు" అన్న సామెత చందంలా ఉందని ఎద్దేవా చేశారు. దీనికి పచ్చ మీడియా వంత పాడుతూ చంద్రబాబు తానా అంటే అవి తందానా అని తాళం వేస్తున్నాయని విమర్శించారు. నిజం నిద్ర లేచే లోపు అబద్ధం లోకాన్ని చుట్టి వస్తుందన్న సామెతలా చంద్రబాబు చెప్పే అబద్ధాలను పచ్చ మీడియా అరక్షణం ఆలస్యం చేయకుండా ప్రచా(సా)రం చేసేందుకు తహతహలాడుతున్నాయని ఆయన తెలిపారు. ఈ విషయంలో ఓ దినపత్రిక అందరి కన్నా ముందు వరుసలో నిలబడి నిస్సిగ్గుగా పత్రికా విలువలకు తిలోదకాలు ఇచ్చేసిందని ఈసడించారు. చంద్రబాబు "చెప్పేది కొండంత – చేసేది గోరంత" అయితే ఆ పత్రిక మాత్రం దానికి పూర్తి రివర్సుగా కథనాలు వండి వడ్డిస్తోందని విమర్శించారు. తెలుగు దినపత్రికలా కాక తెలుగుదేశం కరపత్రికలా మారిపోయిన ఆ పత్రికను బహిష్కరించాలని పరిశపోగు శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. వైయస్సార్ స్టూడెంట్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ వినోద్ మాట్లాడుతూ విద్యా దీవెన పథకంలో ఎనిమిది క్వార్టర్లు బకాయి ఉందని.. వసతి దీవెన అసలు లేనే లేదని.. విద్యా కానుక అరకొరగా ఇస్తున్నారని ఆరోపించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర మహిళా విభాగం అధ్యక్షురాలు కేసరి సుబ్బులు మాట్లాడుతూ పేద ప్రజలకు, ప్రధానంగా మహిళలకు సంక్షేమ పథకాలు వృథా అన్నట్లుగా తన అనుకూల మీడియాలో కథనాలు రాయిస్తోన్న చంద్రబాబు వైఖరిని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగం నేతలు గనిక జాన్సీ, స్వర్ణ, రజియా బేగం, వెంకాయమ్మ, తులసి, యువజన విభాగం నేత వెంకటేశ్వరరెడ్డి, విద్యార్థి విభాగం నేతలు అరుణ్, అభి, రోషన్, వీరాస్వామి, తేజ, వెంకటేశ్వరరెడ్డి, రోహన్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యాజ్యోతి బుక్స్ పంపిణీ చేసిన

**టీడీపీ యువకెరటం యరపతినేని నిఖిల్**



**పిడుగురాళ్ల మేజర్ న్యూస్ :** మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ హై స్కూల్ నందు పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు విద్యాజ్యోతి బుక్స్ విద్యార్థులకు యరపతినేని నిఖిల్ బాబు చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా నిఖిల్ బాబు మాట్లాడుతూ.. విద్యార్థులు మీరు గవర్నమెంట్ వారి ఇచ్చే సదుపాయాలను చక్కగా వినియోగించుకొని, భవిష్యత్తులో మీరు ఉన్నత చదువులు చదవాలని, మీరు ఈ పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని, అందరూ వంద శాతం పాస్ అవ్వాలని దీవించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు చల్లగుండ్ల శంకర్ నారాయణ, ఉన్నం హాస్పటల్ డాక్టర్ నాగ మల్లికార్జునరావు, పట్టణ టీడీపీ అధ్యక్షులు పిల్లి చెన్నారావు, పాండురంగ శ్రీను, మహమ్మద్ అలీ, సర్వేశ్వరరావు, స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ బాలకృష్ణ ఇతర నాయకులు పాల్గొని పిల్లలకు విద్యాజ్యోతి బుక్స్ ను పంపిణీ చేయడం జరిగింది.

# ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ద్వితీయ మహాసభలు

**పిడుగురాళ్ల మేజర్ న్యూస్ :** పట్టణంలోని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఎంప్లాయిస్ యూనియన్ ద్వితీయ మహాసభలు ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపో ఎంప్లాయిస్ యూనియన్ వారు నూతనంగా నిర్మించుకుంటున్న ఎంప్లాయిస్ యూనియన్ భవనం నుండి మెయిన్ రోడ్ లో గల ఫేమస్ ఫంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి, ఫంక్షన్ హాల్ లో మహాసభ జరుపుకోవడం జరిగింది. ఈ సభకు ఎంప్లాయిస్ యూనియన్ పల్నాడు జిల్లా అధ్యక్షులు షేక్ కాజా అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా విచ్చేసినటువంటి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదర్ రావు, జిల్లా ఏపీ జేఏసీ అధ్యక్షులు ఎన్ నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మందపాటి శంకర్రావు, సిపిఐ పిడుగురాళ్ల మండల కార్యదర్శి అక్కినపల్లి బాలయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సభను ఉద్దేశించి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదర్ రావు మాట్లాడుతూ.. సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో నడుస్తున్నటువంటి ఏఐటిసి యూనియన్ ప్రజా సంఘంగా ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్ 70 సంవత్సరాల చరిత్రను కలిగి ఉందని, ఈ 70 సంవత్సరాలలో సిపిఐ పార్టీ ఏఐటీసీ యూనియన్ అండదండలతోటి కార్మికుల హక్కులు పొందటంలోనూ కాపాడటంలోనూ ఎన్నో పోరాటాలు ఎన్నో విజయాలు సాధించడం జరిగిందన్నారు. 70 సంవత్సరాల చరిత్రలో ఎంప్లాయిస్ యూనియన్ సాధించినటువంటి విజయాలు ఏ ప్రజా సంఘం సాధించలేదని, పోరాటంలో వంద సంవత్సరాల చరిత్ర కలిగినటువంటి సిపిఐ పార్టీ వారసత్వం మనలో ఉందని, ఆ పోరాట పటిమ మనలో ఉండుట చేత మేనేజ్మెంట్ వారు ఎన్నో ప్రలోభాలతో లొంగ తీసుకోవాలని ప్రయత్నించినా.. కుదరలేదు. చెక్కుచెదరని కమ్యూనిస్టు భావాలు పోరాట శక్తి కలిగిన సంఘంగా మనం బలంగా ఉన్నాం కాబట్టి ఇన్ని విజయాలు సాధించగలిగామని, ఇవాళ రాష్ట్రంలో అతిపెద్ద ప్రజా సంఘంగా, ప్రజలకు ఎన్నో సేవలు అందిస్తూ ఉన్నటువంటి ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ అని తెలియజేశారు. డిపోల పరిధిలో నాయకులుగా ఉన్నటువంటి వారు కార్మికుల్లో ఎటువంటి తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, తప్పులు జరిగితే ఆ తప్పులను అడ్డుపెట్టుకొని మేనేజ్మెంట్ వారు మన హక్కులపై గొడ్డలి పెట్టేటువంటి అవకాశం ఉంటుందని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. అనంతరం పిడుగురాళ్ల మండల సిపిఐ కార్యదర్శి అక్కినపల్లి బాలయ్య మాట్లాడుతూ.. 100 సంవత్సరాలు చరిత్ర కలిగినటువంటి సిపిఐ పార్టీ ప్రజల మనుగడ కోసం ముఖ్యంగా క్రింది స్థాయి కార్మికులు,ఉద్యోగులు పేద ప్రజల అభ్యున్నతి కోసం, వారి హక్కులు కాపాడటం కోసం ఎన్నో ప్రజా సంఘాలు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఈ ప్రజా సంఘాల ద్వారానే ఈనాటికీ పేద ప్రజలు కార్మికులు వారి హక్కులను కాపాడుకుంటూ ప్రభుత్వాల నుండి, సమాజం నుండి ఎదురయ్యేటువంటి అనేక సమస్యల నుండి ఎప్పటికప్పుడు బయటపడుతూ జీవిస్తున్నారు. అంతేకాదు ఈ మధ్యకాలంలో అనేక పార్టీలు పెట్టుబడి విధానం రత్తందారీ విధానంతో ఆయా పార్టీలో మనుగడ కోసం ప్రజా సంఘాలను నిర్మించుకోవడం జరుగుతుంది.




ఆయా ప్రజాసంఘాలు ఏ పార్టీ అయితే అధికారంలో ఉంటుందో ఆ పార్టీకే మద్దతు పలుకుతూ కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడే యూనియన్ ఎంప్లాయిస్ యూనియన్ అయితే ఎంప్లాయిస్ యూనియన్ చేసేటువంటి పోరాటాలలో విఘాతం కలిగిస్తూ ఉండటానికే ఆయా పార్టీలు ప్రజాసంఘాలను ఏర్పాటు చేస్తాయని ఆయా ప్రజా సంఘాల్లో చేరి మీరు మోసపోవద్దని, ఆ విధమైనటువంటి మోసపూరిత విధానానికి బలి కాకూడదని, కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసేటువంటి ఎంప్లాయిస్ యూనియన్ నే బలపరచండని, మీకు ఎప్పుడు సిపిఐ పార్టీ అండగా ఉంటుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపి పిటిడి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎలిశెట్టి దామోదర్, జనరల్ సెక్రెటరీ నారాయణ, ఉపాధ్యక్షులు మందపాటి శంకర్రావు, కార్యదర్శి బి కోటేశ్వరరావు, ఎన్ వి కృష్ణారావు. జోనల్ అధ్యక్షులు వాకా రమేష్, ప్రచార కార్యదర్శి. జిల్లా అధ్యక్షులు షేక్ ఖాజావలి, కార్యదర్శి జి తిరుపతిరావు, ఆర్గనైజర్ సెక్రటరీ ఒ సుశీల, జనరల్ కార్యదర్శి అనురాధ, 6 డిపోల అధ్యక్షులు, కార్యదర్శులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మూడు గ్రామాల్లో తొలిసారిగా సొసైటీ ద్వారా ఎరువులు పంపిణీ

**వ్యవసాయ శాఖ గుంటూరు ఏడిఏ యన్. మోహన్ రావు**



**వట్టిచెరుకూరు మేజర్ న్యూస్ :** వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు గ్రామంలోని పిఏసిఎస్ సొసైటీ పరిధిలోని వింజనంపాడు, పుల్లడికుంట, చమళ్ళమూడి గ్రామాలలోని రైతు సోదరులందరికి మొట్ట మొదటి సారీగా సొసైటీ తరఫున ఎరువులు పంపిణీ కార్యక్రమం సొసైటీ అధ్యక్షురాలు అయినటువంటి చెరుకూరి నిర్మల ఆధ్వర్యంలో రైతు సోదరులకు యూరియా ఎరువులు మొట్ట మొదటి సారీ గా పంపిణీ చేయడం జరిగింది . ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఏడిఏ గుంటూరు యన్. మోహన్ రావు, మరో ముఖ్య అతిథిగా ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అయినటువంటి నార్నె వీర శివ వర ప్రసాద్ పాల్గొన్నారు,ఈ కార్యక్రమంలో ఏడీఏ మాట్లాడుతూ రైతు సోదరులకు మన ప్రభుత్వం రైతు సోదరులందరికీ యూరియా డిఏపి, కాంప్లెక్స్ ఏ రువులు అందించాలని ముఖ్య ఉద్దేశంతోటి ప్రతి ఒక్క సొసైటీ ఆధ్వర్యంలో ఎరువులు పంపిణీ కార్యక్రమం చేయాలని ఆదేశించి ఉన్నారు, ఈ కార్యక్రమంలో భాగంగా వింజనంపాడు సొసైటీకి కొత్తగా ఈ రబీ నుండి రైతు సోదరలకు ఎరువులు పంపిణీ చేశారు,ఈరోజు మొట్టమొదట విడతగా 440 బస్తాల సీఐఎల్ యూరియా ఎరువులు ఇవ్వటం జరిగింది అని తెలియజేయడం జరిగింది ముఖ్యంగా ఎక్కడ కూడా రైతులు ఎమ్మార్పీకి మించి కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని, మన వట్టిచెరుకూరు మండలం లో ఎరువుల కొరత లేదని, అదే విధంగా రైతులకి సరిపడినంత ఏరియా కూడా అందిస్తామని తెలియచేశారు.ఎక్కడా కూడా రైతులు ఇబ్బంది పడకుండా, ఆందోళన చెందకుండా వారికి కావలసినటువంటి ఎరువుల్ని ఈ సొసైటీలో ఈ మూడు గ్రామాల పరిధిలో ఉన్న రైతు సోదరులు తీసుకోవాలని చెప్పారు, ఇప్పుడున్న 440 బస్తాలు యూరియా అయిపోయిన వెంటనే మళ్ళీ 440 బస్తాల యూరియాను సప్లై చేస్తామని తెలియజేశారు, అలాగే ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎ ఎం సి వైస్ చైర్మన్, సొసైటీ పర్సన్ మెంబర్స్ అయినటువంటి కురుకుట్ల వెంకయ్య, మంచాల ముసలయ్య, అలాగే గ్రామ సర్పంచి నార్నె రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ ఉప్పుటూరి సుజాత, అలాగే మాజీ సొసైటీ ప్రెసిడెంట్ జంపాని శ్రీనివాసరావు, సీఈవో శ్రీనివాసరావు అలాగే గ్రామ పెద్దలు ముప్పరాజు భాస్కరరావు, చెరుకూరి శ్రీనివాసరావు, నార్న సాంబశివరావు, అలాగే ఆఫీస్ స్టాఫ్ గోపి, సచివాలయం సిబ్బంది, రైతు సేవ కేంద్రం స్టాఫ్ వి ఎ ఎ, సచివాలయం సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రేపు విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ఏపీ స్పేస్ టెక్ సమ్మిట్ - 2026




**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్:** గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీ, అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ స్పేస్‌టెక్ అకాడమీ, హైదరాబాద్‌లోని అనంత్ టెక్నాలజీస్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి 24 వరకు ఆంధ్రప్రదేశ్ స్పేస్ టెక్ సమ్మిట్–2026 ను నిర్వహిస్తున్నట్లు వర్సిటీ ఇంచార్జి వైస్ చాన్స్‌లర్ డాక్టర్ కేవీ క్రిష్ణకిషోర్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా సమ్మిట్‌కు సంబంధించిన బ్రోచర్‌ను విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, ఏపీ సైన్స్ సిటీ సీఈవో కేశినేని వెంకట్ కలిసి ఆవిష్కరించారు. ఈ సమ్మిట్‌కు శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్, ఎన్‌ఆర్‌ఎస్ సీ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ చౌహాన్, డీఆర్ డీవో మాజీ చైర్మన్ డాక్టర్ జీ. సతీష్ రెడ్డి, ఏపీ ప్రభుత్వ రోడ్లు, భవన నిర్మాణాల శాఖ మంత్రివర్యులు బీసీ జనార్ధన్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొననున్నట్లు ఇంచార్జి వైస్ చాన్సలర్ డాక్టర్ కె వి కృష్ణ కిషోర్ తెలిపారు.

**సౌత్ ఇండియా రాకెట్రీ చాలెంజ్-2026 ప్రధాన ఆకర్షణ**

సమ్మిట్‌లో భాగంగా నిర్వహించే "సౌత్ ఇండియా రాకెట్రీ చాలెంజ్–2026" లో దేశవ్యాప్తంగా ఇంజినీరింగ్, డిగ్రీ, స్కూల్, పాలిటెక్నిక్ విద్యార్థి బృందాలు పాల్గొననున్నాయని ఏపీ సైన్స్ సిటీ సీఈవో కేశినేని వెంకట్ తెలిపారు. ఈ పోటీల్లో భాగంగా విద్యార్థులు స్వయంగా చిన్న రాకెట్ల నమూనాలను రూపకల్పన చేసి, తయారు చేసి, లాంచ్ చేయడం ద్వారా రాకెట్ డిజైన్, ఏరోడైనమిక్స్, ప్రొపల్షన్, ఫ్లైట్ స్టెబిలిటీ వంటి అంశాలపై ప్రాయోగిక అవగాహనను పెంపొందించుకోగలరన్నారు. రాకెట్ యొక్క రేంజ్, ఎత్తు, స్థిరత్వం, డిజైన్ ఇన్నోవేషన్, సేఫ్టీ ప్రోటోకాల్ వంటి ప్రమాణాల ఆధారంగా విజేతలను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. విజేతలకు ప్రత్యేక ట్రోఫీలు, సర్టిఫికేట్లు, నగదు బహుమతులు, ఇంటర్న్‌షిప్ అవకాశాలు అందజేయనున్నట్లు చెప్పారు. ఆసక్తిగల విద్యార్థులు యూనివర్సిటీ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, ఏపీ సైన్స్ సిటీ సీఈవో కేశినేని వెంకట్, విజ్ఞాన్స్ వర్సిటీ ఇంచార్జి వైస్ చాన్స్‌లర్ డాక్టర్ కేవీ క్రిష్ణకిషోర్, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

## ఐతానగర్ సమాధుల స్థలం కేటాయించండి



**~నాలి, మేజర్ న్యూస్ :** తెనాలి ఐతానాగర్ సమాధుల తోట స్థల సాధన కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు, దైవ సేవకులు ఐక్యంగా కలిసి సమాధుల తోటకు తక్షణమే స్థలం కేటాయించాలని మంత్రి నాదెండ్ల మనోహర్ ను మంగళవారం మరొకసారి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సానుకూలంగా స్పందించారు. సమాధుల తోట స్థలం కేటాయింపుపై ప్రభుత్వం వేగంగా నిర్ణయం తీసుకునే ఆలోచనలో ఉందని, త్వరితగతిన అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం తెనాలి ఐతానాగర్ సమాధుల తోట పూర్తిగా నిండిపోవడంతో ఒక్క అడుగు స్థలం కూడా లేకుండా అత్యంత దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని కమిటీ సభ్యులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. కొత్త సమాధులకు స్థలం లేకపోవడంతో పాత సమాధులను పగలగొట్టి వినియోగించాల్సిన దుస్థితి ఏర్పడిందని, దీంతో మరణించిన పూర్వీకుల జ్ఞాపకాలు శాశ్వతంగా నశిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను అత్యవసర అంశంగా పరిగణించి, మానవీయ దృష్టితో వెంటనే సమాధుల తోటకు తగిన స్థలం కేటాయించాలని సమాధుల తోట స్థల సాధన కమిటీ సభ్యులు మంత్రి కోరారు.

# గ్రామీణ మహిళలు డిజిటల్ నైపుణ్యం సాధించాలి



**తాడికొండ మేజర్ న్యూస్:** గ్రామాల్లో నివసించే మహిళలు కంప్యూటర్ల ద్వారా డిజిటల్ నైపుణ్యం సాధించుకోవాలని, వారి అభివృద్ధి కొరకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంప్యూటర్ దీదీ ప్రోగ్రాం ద్వారా మహిళలు డిజిటల్ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని తాడికొండ శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్ కోరారు. మంగళవారం నాడు తాడికొండలో నిర్వహించిన కంప్యూటర్ దీదీ ప్రోగ్రాం లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శాసనసభ్యులు మాట్లాడుతూ గ్రామీణ మహిళలు తమ జీవనోపాధిని పెంపొందించడం కొరకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని,కంప్యూటర్ల ద్వారా ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఆన్లైన్ దరఖాస్తులు, డిజిటల్ చెల్లింపులు,వివిధ రకాల సర్టిఫికెట్లు వంటి వాటికి సేవ చేస్తూ మహిళలు తమ జీవనోపాధి అభివృద్ధి పరచుకోవచ్చు అన్నారు. ఈ మహత్తర కార్యక్రమం నిర్వహించడానికి బి ఏబుల్ ఫౌండేషన్ ముందుకు రావడం శు భపరిణామమని అన్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో ఆరు దీదీ కేంద్రాలు నడుపుతున్నమని,ఈరోజు 4 కేంద్రాలకు కంప్యూటర్లు అందించబడతాయని అన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కే సమతావాని, యూనిసెఫ్ కార్యకర్త అనురూప్ రాజచవతీతీచ,మ్మార్వో ప్రసన్న, ఏపీఎం సాంబశివరావు, టిడిపి నాయకులు కృష్ణారావు హనుమంతరావు, మండల పార్టీ అధ్యక్షులు సాంబశివరావు, పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఎరువులను యం.ఆర్.పి. కంటే అదనంగా వసూలు చేస్తే కఠిన చర్యలు

**- పురుగు మందులు, ఎరువుల షాపులలో వ్యవసాయ శాఖ తనిఖీలు**
**- అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఎన్. మోహన్ రావు**

**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్:** ప్రత్తిపాడు మండలంలోని మోహన్ ట్రేడర్స్, సాయి రామ్ ట్రేడర్స్, శ్రీనివాస ట్రేడర్స్, పైనీర్ ఆగ్రోస్, అమరలింగేశ్వర ఫర్టిలైజర్, మన గ్రోమోర్, ప్రత్తిపాడు జీడీసీఎం ఎస్ సెంటర్ ఎరువుల దుకాణలను మంగళవారం అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఎన్. మోహన్ రావు గుంటూరు, మండలం వ్యవసాయాధికారి షేక్. సుగుణ బేగం తనిఖీ చేయడం చేసారు. ఇందులో భాగంగా ఎరువుల డీలర్లు అందరూ ఎరువులను యం.ఆర్. పి. కి మాత్రమే అమ్మాలని తెలియజేశారు. ఎవరైనా యం. ఆర్. పి. కంటే ఎక్కువ ధరకు విక్రాయించినచో, యూరియాతో వేరే ఎరువులు జత పరిచి అమ్మినచో వారి పై చట్ట పరమైన చర్యలు తీసుకోనబడును అని హెచ్చరించారు. యూరియా, డిఏపీ ఎరువులు కావలసిన అంత ఎరువులు అందు బాటులో ఉన్నాయని తెలిపారు, ప్రతి ఎరువుల షాపులలో ఎంఆర్పీ రెట్లకే అమ్ముతున్నామని బోర్డులు ఏర్పాటు చేసామని తెలిపారు.

# దళిత సోదరులు ఎవ్వరూ వైసీపీ మాటలకు మోసపోవద్దు

**- టీడీపీ రాష్ట్ర నాయకులు వర్ల రామయ్య**



పిడుగురాళ్ల,మేజర్ న్యూస్: పట్టణంలోని ఆర్ అండ్ బి బంగ్లాలో జరిగిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర టీడీపీ పొలిటి బ్యూరో సభ్యులు వర్ల రామయ్య మాట్లాడుతూ.. ప్రతిపక్ష వైసీపీ నాయకులు దళితులను రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నారని, దళిత సోదరులు ఎవ్వరూ వారి మాయమాటలకు మోసపోవద్దని హెచ్చరించారు. మాచవరం మండలం పిన్నెల్లి గ్రామంలో రెండు దళిత కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణను రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో పిన్నెల్లి గ్రామ దళితులకు వైసీపీ ప్రభుత్వం చేసిన మేలు ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. 2014–2019 మధ్యకాలంలో పిన్నెల్లి దళితవాడలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులు చేయటం జరిగిందని, ఇప్పటికీ అవి అక్కడ దర్శనం ఇస్తున్నాయని తెలిపారు. గురజాల మండలం పాత అంబాపురం గ్రామానికి చెందిన దోమతోటి విక్రమ్ అనే ఎస్సీ మాల వర్గానికి చెందిన యువకుడిని హైదరాబాద్ నుంచి పిలిపించి, పోలీస్ స్టేషన్లో చిత్రహింసలకు గురి చేసి అతని మరణానికి వైసీపీ నాయకులు కృషి చేశారు. వైసీపీ నాయకులకు అండగా అప్పటి శాసనసభ్యులు కాసు మహేష్ రెడ్డి బహిరంగ మద్దతుగా నిలిచారు. ఆ విషయంలో పలుమార్లు డీజీపీని కలిసేందుకు ప్రయత్నం చేయగా వైసీపీ ప్రభుత్వం తమను అడ్డుకున్నదని ఆరోపించారు. అదేవిధంగా విశాఖపట్నంలో కరోనా సమయంలో దళిత ప్రభుత్వ డాక్టర్ సుధాకర్ వైద్య సౌకర్యాల పై ప్రభుత్వాన్ని విమర్శిస్తే అతనిని మానసికంగా హింసించి అతని మరణానికి కారుకులైనారు. ఇటువంటి అకృత్యాలు చేసిన వైసీపీ నాయకులు ఇప్పుడు దళితులపై ముసలి కన్నీరు కారుస్తున్నారని బియ్యబట్టారు. రాజధాని అమరావతి నిర్మాణానికి భూములు ఇచ్చిన దళిత రైతులు న్యాయం కోసం పోరాడితే వాళ్లని అరెస్టు చేసి జైల్లో ఒక పంపిన ఘనత ప్రతిపక్ష పార్టీ దేనిని విమర్శించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే దళితులు ప్రతిపక్ష వైసీపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని గమనించి దళితులు వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిడుగురాళ్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ తురక వీరస్వామి, జిల్లా ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ అమీర్ అలీ, పట్టణ టీడీపీ అధ్యక్షుడు పిల్లి చెన్నారావు, సీనియర్ నాయకులు షేక్ బాబావలి, మంద డేవిడ్, జిల్లా వాణిజ్య సెల్ అధ్యక్షులు పాండురంగ శ్రీను తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## పెనుమూలి గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం




**దుగ్గిరాల ,మేజర్ న్యూస్ :** దుగ్గిరాల మండల పరిధిలోని పెనుమూలి గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని తెనాలి సహాయ వ్యవసాయ సంచాలకులు ఆర్ విజయబాబు నిర్వహించారు . ముందుగా దుగ్గిరాల గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఎరువుల తనిఖీ ని జిల్లా వ్యవసాయ అధికారి ఎం పద్మావతి, తెనాలి సహాయ వ్యవసాయ సంచాలకు లు ఆర్ విజయబాబు తనకి నిర్వహించి రైతులకు సకాలం ఎరువులు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. తదనంతరం గ్రామంలో మొక్కజొన్న పంట సాగు నుపరిశీలించారు . రైతులతోమాట్లాడుతూ రైతులందరూ ఈ కేవైసీ చేయించుకోవాలని ,రైతు మొబైల్ యాప్ ,రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య కొరకు నమోదు చేసుకోవాలని తెలియజేశారు .కార్యక్రమంలో విస్తరణ అధికారి ప్రజ్ఞాన్ బాబు, వి ఏ ఏ విజయలక్ష్మి ,భార్గవి, ఎంపిఓ రాఘవ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఉచిత సర్వేకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్ కార్యక్రమం

**తెనాలి, మేజర్ న్యూస్ :** రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంటపురం, రోటరీ క్లబ్ ఆఫ్ ఆంధ్ర ప్యారిస్ వారి ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఉచిత సర్వేకల్ క్యాన్సర్ వాక్సినేషన్ బుధవారం తెనాలి రావి సాంబయ్య మున్సిపల్ హై స్కూల్ లో బుధవారం నిర్వహించనున్నారు. వ్యాక్సినేషన్ కొరకు రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఆడపిల్లలకు వాక్సినేషన్ వేయడం జరుగుతుందని క్లబ్ అధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వరరావు, రావి కృష్ణమోహన్, అమరావతి రీజన్ క్యాన్సర్ ఎవర్నెస్ చైర్ కన్నిగంటి మురళీకృష్ణ, ప్రాజెక్ట్ చైర్ ఈదర వెంకట పూర్ణ చంద్ లు తెలియజేశారు. వాక్సినేషన్ వేయించుకునేవారు తమ వెంట ఆధార్ ఫోటోస్టాట్ తప్పనిసరిగా తీసుకురావలని వారు కోరారు.

## 22న త్రికోటేశ్వర స్వామి అభిషేకాలు అభిషేక మండపంలో నిర్వహించబడతాయి

**నరసరావుపేట రూరల్ మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా, నరసరావుపేట మండలం, కోటప్పకొండ క్షేత్రములో వేంచేసియున్న శ్రీ త్రికోటేశ్వరస్వామివారి దేవస్థానం సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి మంగళవారం మీడియా సమావేశం లో మాట్లాడుతూ ఈ నెల 22 వ తేదీన ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ శ్రీ స్వామివారి దేవస్థానము సందర్శించుచున్నం దున భద్రతా కారణాల రీత్యా శ్రీ స్వామివారి గర్భాలయ ములో అభిషేకములు నిర్వహించ బడవు. కావున భక్తులు అభిషేకములు అభిషేక మండపములో నిర్వహించబడతాయని సహా య కమీషనరు మరియు కార్యనిర్వహణా ధికారి తెలియజేశారు.

## రైతులు ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలి




**గుంటూరు రూరల్, మేజర్ న్యూస్;**గుంటూరు రూరల్ మండలం లాలుపురం, బుడంపాడు గ్రామాల్లో "పొలం పిలుస్తోంది" కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బుల్లా కిషోర్ పాల్గొని రైతులకు పలు ముఖ్యమైన సూచనలు చేశారు. రబీ సీజన్‌కు సంబంధించిన ఈ-క్రాప్ బుకింగ్ / డిజిటల్ పంటల సర్వే అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. రబీ ఈ-క్రాప్ బుకింగ్‌లో వచ్చిన కొత్త మార్పుల వివరాలను రైతులకు వివరించి, రబీ సీజన్‌లో సాగు చేస్తున్న ప్రతి రైతు తప్పనిసరిగా తమ పంటలను ఈ-క్రాప్ బుకింగ్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా శెనగ పంటల్లో సస్య రక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. శెనగ పంటల్లో ఎండు తెగులు గమనించిన చోట కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను లీటరు నీటికి 34 గ్రాములు చొప్పున కలిపి, తెగులు సోకిన మొక్కల మొదళ్ల వద్ద పోయాలని సూచించారు. రైతులు తమ ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను రైతు సేవ కేంద్రాల్లో సత్వరమే నమోదు చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు అర్చన, వ్యవసాయ విస్తరణ అధికారి సింధూర, పంచాయతీ సెక్రటరీ, ఇతర ప్రజాప్రతినిధులు మరియు రైతు సోదరులు పాల్గొన్నారు.

# అఖిలభారత కిసాన్ సభ జాతీయ కౌన్సిల్ సమావేశాల ను జయప్రదం చేయాలి



**దుగ్గిరాల, మేజర్ న్యూస్ :** గుంటూరులో ఈనెల 29 నుండి ఫిబ్రవరి ఒకటవ తేదీ వరకు జరిగే అఖిలభారత కిసాన్ సభ జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని కోరుతూ దుగ్గిరాల లో విస్తృతంగా కరపత్రాలతో ప్రచారం చేశారు .జాతీయ కౌన్సిల్ సమావేశా లను జయప్రదం చేయాలని కోరుతూ రైతులతో.పలుచోట్ల సమావేశాలను నిర్వహించారు. ఈ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు మాట్లాడుతూ ఢిల్లీ రైతు ఉద్యమంలో కీలక భూమిక పోషించిన 300 మంది రైతు ఉద్యమ నాయకులు, దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాల నుండి జాతీయ కౌన్సిల్ సమావేశాలకు రానున్నారని ఈ సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు. 2014 లో జరిగిన ఎన్నికల్లో బిజెపి పార్టీ చేసిన ప్రచారంలో భాగంగా రైతు లు పండించే పంటలకు మద్దతు ధరల చట్టాన్ని చేస్తానని, 2022 నాటికి రైతులు ఆదాయం రెట్టింపు చేస్తామని అధికారంలోకి వచ్చి, రైతులకు ఇచ్చిన హామీని తుంగలో తొక్కారని విమర్శించారు . రైతులు సేద్యం చేసి పంటలు పండించి 140 కోట్ల ప్రజలకు ఆహారాన్ని అందించే వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు హస్తగతం చేసేందుకు మూడు నల్ల చట్టాలను ప్రజాస్వామికంగా కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిందని ఘాటుగా విమర్శించారు. ఆ చట్టాలకు వ్యతిరేకంగా వాటిని రద్దు చేయాలని కోరుతూ 540 రైతు సంఘాలు ఏకమై 13 మాసాల పాటు పోరాడి ఆ చట్టాలను రద్దు చేయించ గలిగాయని తెలిపారు. రద్దు చేసిన మూడు వ్యవసాయ చట్టాల కన్నా ప్రమాదకరమైన వ్యవసాయ విధానాలను దొడ్డి దోవన కేంద్ర ప్రభుత్వం తిరిగి ప్రవేశ పెట్టిందని. తెలిపారు . నేడు పేద రైతుల వద్ద ఉన్న భూములను అభివృద్ధి పేరుతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దోచేందుకు బలవంత పు భూ సేకరణ చేస్తున్నాయని విమర్శించారు .బలవంతభూసేకరణ ను అడ్డుకునేందుకు వ్యవసాయాన్ని కాపాడుకుందాం. రైతు.ను రక్షించుకుందాం అనే నినాదంతో కిసాన్ సభ పనిచేస్తుందని ,దానిలో భాగంగానే గుంటూరులో జరిగే జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో వ్యవసాయ రంగంపై చర్చించనున్నారని తెలిపారు .వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ల కబంధహస్తాలకు అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రమాదకరమైన చట్టాలను చేస్తుందని. అప్పారావు అన్నారు .గుంటూరులో జరిగే జాతీయ సమావేశాల్లో భవిష్యత్తులో వ్యవసాయ రంగంలో వచ్చే సమస్యలపై పోరాటాలు నిర్వహించేందుకు , సన్నద్ధం కావడానికి సమావేశాలు జరుగు తా.యని వీటిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పేద మధ్య తరగతి రైతుల కోసం అనేక పోరాటాలు నిర్వహించిందని, తెలిపారు. గిట్టుబాటు ధరల కోసం పంటలు కొనుగోలు కొరకు ఉద్యమాలు ,పోరాటాలు నిర్వహించిందని. అన్నారు . రాష్ట్రవ్యాప్తంగా పాడి రైతుల సమస్యలపై ఆందోళన నిర్వహించిందని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ,బ్యాంకు రుణాలు అందజేయాలని పోరాటాలు నిర్వహించిందని బాలరాజు తెలిపారు. నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని దెబ్బతీయడం కోసం వ్యవసాయ రంగాన్ని కార్పోరేట్లకు అప్పచెబుతున్నారని, దానిలో భాగమే విత్తన చట్టాన్ని ,విద్యుత్. సవరణ చట్టాన్ని తీసుకొస్తున్నాయని తెలిపారు. మండలంలో హైవే ఛానల్ కోసం, పసుపు రైతుల సమస్యల, వాణిజ్య పంటల సమస్యలపై పలు పోరాటాలు నిర్వహించిందని బాలరాజు అన్నారు. ధాన్యానికి. గిట్టుబాటు ధర కల్పించాలని, మొక్కజొన్న ,సపోటా, రైతుల సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్నామని , వాటి పరిష్కారం కోసం రాబోయే కాలంలో మరిన్ని పోరాటాలు నిర్వహించేందుకు రైతంగ సమస్యల కోసం పోరాటం చేసేందుకు జాతీయ సమావేశాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల రైతు సంఘం కార్యదర్శి యార్లగడ్డ బ్రహ్మేశ్వర రావు, ఎం .మేకల నాగేశ్వరరావు, శ్రీనివాసరావు ,వెంకటేశ్వరరావు ,సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ తొక్కిసలాట ఘటనపై స్పందించిన చీఫ్ విప్ జీవి



**వినుకొండ మేజర్ న్యూస్:** వినుకొండ ఆర్టిసి డిపోలో సోమవారం ఉదయం జరిగిన తొక్కిసులాట ఘటనపై ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు స్పందించారు. ఆర్టీసీ డిఎం జవ్వాజి నాగేశ్వరరావుతో ఫోన్లో మాట్లాడి ఘటనకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికుల రక్షణకై ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే సహించేది లేదని హెచ్చరించారు. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. తెప్పిస్తాలాటలో గాయపడిన బెల్లంకొండ చిన్న వెంకయ్య, ఎస్తేరు రాణి, తమిరి కోటేశ్వరమ్మ ఆరోగ్య విషయమై వైద్యులతో మాట్లాడి వారి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన డ్రైవర్ పై చర్యలు వినుకొండ ఆర్టిసి డిపోలో తొక్కిసలాటకు, ముగ్గురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడడానికి కారణమైన డ్రైవర్ బాల నాగేశ్వరరావు విధుల నుండి తొలగించడం జరిగిందని డిపో మేనేజర్ తెలిపారు. సోమవారం ఉదయం డిపోలో ఆవరణ అంతా ప్రయాణికులతో నిండి గ్యారేజీ వైపు వచ్చారని, విజయవాడ వెళ్లేందుకు బస్సు గ్యారేజీ నుండి బయటకు రాగానే ప్రయాణికులు బస్సు వద్దకు గుంపుగా రావటంతో డ్రైవర్ బస్సును ఆపకుండా ముందుకు కదిలించడం వలన తొక్కిసలాట జరిగి ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారని అందుకు కారణమైన డ్రైవర్ పై చర్యలు తీసుకోవడం జరిగిందని డిఎం తెలిపారు. చీఫ్ విప్ జీవి ఆంజనేయులు ఆదేశాల మేరకు ప్రయాణికులు ఇబ్బంది పడకుండా తగిన ఏర్పాట్లు చేశామని, మంగళవారం కూడా ప్రయాణికుల రద్దీ ఉన్నప్పటికీ సరిపడ బస్ సర్వీసులను పెంచడం జరిగిందన్నారు. డిపో పరిధిలో పోలీస్, ఆర్టీసీ సిబ్బందితో క్యాంపు ఏర్పాటు చేసి ప్రయాణికులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

## దుగ్గిరాల ప్రాథమిక సహకార పరపతి సంఘాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించిన జిల్లా వ్యవసాయ అధికారి



**దుగ్గిరాల ,మేజర్ న్యూస్ :** యూరియా కోసం బారులు తీరిన రైతన్నలు కథనంపై దుగ్గిరాల ప్రాథమిక సహకార పరపతి సంఘాన్ని జిల్లా వ్యవసాయ అధికారి ఎం. పద్మావతి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు .రైతులకు యూరియా అందడం లేదని యూరియా కోసం సొసైటీల వద్ద వేచి ఉండవలసి వస్తుంద.న్న సమస్యలు పై తనిఖీ నిర్వహించి రికార్డులను పరిశీలించి రైతులతో మాట్లాడారు.. జిల్లా వ్యాప్తంగా రైతులకు అవసరమైన యూరియా నిల్వలు ఉన్నాయని రైతుల నుండి ఎలాంటి ఫిర్యాదులు అందలేదని తెలిపారు. వ్యవసాయ శాఖలో ఈక్రాప్ నమోదు ప్రక్రియ కొనసాగుతుందని ,ప్రతి రైతు ఈక్రాప్ చేయించుకోవాలని కోరారు కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఆర్ విజయబాబు ,ఏఈఓ ప్రజ్ఞాన బాబు, ఎంపీఈఓ రాఘవ ,వి ఏ ఏ విజయలక్ష్మి ,డిసి చైర్మన్ గొరనేని అనిల్, పెదపాలెం గ్రామ సర్పంచ్ పాటిబండ్ల కృష్ణ ప్రసాద్, సొసైటీ కార్యదర్శి సూర్యనారాయణ ,రైతులు ,తదితరులు పాల్గొన్నారు.



## పేద కుటుంబాలను ఆదుకుంటున్న సీఎం సహాయ నిధి చీఫ్ విప్ జీవీ



**వినుకొండ మేజర్ న్యూస్:** సీఎం సహాయనిది పేదల పాలిటి పెన్నిదని ప్రభుత్వ చీఫ్ విప్, శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు అన్నారు. నియోజకవర్గ పరిధిలోని సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 113 మంది లబ్ధిదారులకు, 59 లక్షలు 86 వేలు చెక్కులను మంగళవారం తన కార్యాలయంలో చీఫ్ విప్ జీవీ పంపిణీ చేశారు. వైద్య పరంగా ఆపదలో ఉన్న వారికి సకాలంలో చికిత్స కోసం ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వైద్య సహాయం కోసం సీఎం చంద్రబాబు నాయుడు అందించిన నిధులు, తమకు అందేలా కృషిచేసిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ చెక్కులు అందుకున్న లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో, పరిశీలకులు మానుకొండ శివప్రసాద్ , జనసేన నాయకులు నిస్సంకర శ్రీనివాసరావు,నాయకులు పాల్గొన్నారు.

# బ్లాక్ బెయిల్ రాజకీయం వైసీపీకే సాధ్యమన్న టిడిపి మండల నాయకులు



**వినుకొండ మేజర్ న్యూస్ :** బీసీలపై దాడులు చేసిన వైసీపీ.. రాష్ట్ర పార్టీ అధ్యక్ష పదవి ఇచ్చిన టిడిపి – ఐరాం మూర్తి వ్యాఖ్యలను ఖండించిన శావల్యాపురం టిడిపి నాయకులు శావల్యాపురం కు చెందిన వైసిపి నాయకుడు ఐరాంమూర్తి టిడిపి మండల నాయకులపై చేసిన నిరాధారణమైన ఆరోపణను శావల్యాపురం టిడిపి నాయకులు తీవ్రంగా ఖండించారు. మంగళవారం వినుకొండ చీఫ్ విప్ కార్యాలయంలో జరిగిన విలేఖర్ల సమావేశంలో శావల్యాపురం మండల పార్టీ అధ్యక్షులు గుంటూరు సాంబశివరావు, సొసైటీ అధ్యక్షులు గడిపూడి విశ్వనాథం, రాష్ట్ర బీసీ సెల్ నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు మాట్లాడారు. తాను బీసీ నాయకుడినని, టిడిపి నాయకులు నన్ను బెదిరించారని అసత్య ఆరోపణ చేయటం సరి కాదన్నారు. 5 ఏళ్ల వైసీపీ పాలనలో శావల్యాపురం ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలో కనీస మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బంది పడ్డారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామంలోని ఎస్సీ ఎస్టీ బీసీ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలను వార్డు మెంబర్ల మెజార్టీతో తీర్మానం చేయించి పనులు చేసి పరిష్కరించడం జరిగిందన్నారు. చేసిన పనులకు బిల్లులు చేయటానికి వీలులేదని పంచాయతీ సెక్రెటరీ, ఏఈ లను ఐరాంమూర్తి బెదిరించి బ్లాక్ మెయిల్ చేశాడని తెలిపారు. తనే బ్లాక్ మెయిల్ చేస్తూ టిడిపి నాయకులపై నిరాధారమైన ఆరోపణ లు చేయటం దుర్మార్గమన్నారు. గత వైసిపి పాలనలో శావల్యాపురం షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంపై అధికారులను బెదిరించటం, అప్పటి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు బ్లాక్మెయిల్ చేయడం తర్వాత ఆ పార్టీ కండువా తప్పుకోవటం వెనుక నీ స్వార్థం ఏమిటనేది ప్రజలకు తెలిసిపోయిందన్నారు. నీ లాంటి బ్లాక్ మెయిలర్స్ కూడా బీసీల గురించి మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. వైసిపి పాలనలో బీసీలపై అనేక దాడులు జరుగుతుంటే నీవు ఏమి చేశావని వారు ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ అంటేనే బీసీల పార్టీ అని, అలాంటి పార్టీని విమర్శిస్తే బీసీలు క్షమించరని అన్నారు. టిడిపి రాష్ట్ర పార్టీ అధ్యక్షులు, అనేక కీలకమైన పదవులు బీసీలకు కల్పించిన పార్టీ టిడిపి అని తెలిపారు. ఎన్టీ రామారావు వర్ధంతి సందర్భంగా శావల్యాపురం గ్రామంలో జరిగిన సభలో ఎవరిని టిడిపి నాయకులు విమర్శించలేదని, మెప్పుకోసం, కొందరిని బ్లాక్మెయిల్ చేయడం కోసం ఐరాంమూర్తి వ్యక్తిగత ఆరోపణలు చేయటం సరికాదన్నారు.

# ఘనంగా ఫిట్స్ కళాశాల చైర్మన్ చందు రామారావు పుట్టినరోజు వేడుకలు



**దుగ్గిరాల మేజర్ న్యూస్ :** దుగ్గిరాల మండల పరిధిలోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల చైర్మన్ చందు రామారావు పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. చందు రామారావు జన్మదినం సందర్భంగా భారీ కేకును కట్ చేసి జన్మదిన శు భాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమానికి జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు ఏపీఐడీసీ అధ్యక్షులు దేగల ప్రభాకర్ రావు, జనసేన పార్టీ అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, కళాశాల కార్యదర్శి చందు విజయలక్ష్మి, వైస్ చైర్మన్ చందు రోహిత్, చందు విజయ దుర్గ, అవంతి, స్రవంతి, ఏఎన్యూ రెక్టార్ ఆర్ శివరాం ప్రసాద్, తెనాలి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ తోటకూర వెంకటరమణ, చందు బాబురావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్ లక్ష్మీనారాయణ, డాక్టర్ ఎన్ సుజాత, బి. జీవన్ కుమార్, డివిఎస్ ఫణి కుమార్, చింతల శ్రీనివాసరావు, చందు బాబురావు, హెచ్ ఓ డి లు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# రూ.26 కోట్లతో తెనాలిలో 50 పడకల నూతన ఆయుష్ హాస్పిటల్

## – మంత్రి నాదెండ్ల మనోహర్




**తెనాలి మేజర్ న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం ఆయుష్ వైద్యాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో రాష్ట్రానికి ఐదు ఆయుష్ హాస్పిటల్స్ మంజూరు చేయగా, అందులో తెనాలికి రూ.26 కోట్ల వ్యయంతో 50 పడకల ఆయుష్ హాస్పిటల్ మంజూరు చేసినట్లు రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈ సందర్భంగా తెనాలిలోని కొత్తపేటలో ఉన్న పాత గవర్నమెంట్ హాస్పిటల్ ప్రాంగణాన్ని మంత్రి అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయుర్వేదంతో ఆరోగ్యం సాధ్యమవుతుంది. మారుతున్న వాతావరణ పరిస్థితులు, కాలుష్య సమస్యల నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా భారతదేశ ఆయుర్వేద వైద్యానికి విశేష ఆదరణ లభిస్తోంది. ఈ క్రమంలో తెనాలికి 50 పడకల ఆయుష్ హాస్పిటల్ మంజూరు కావడం గర్వకారణం అని అన్నారు. సుమారు 120 సంవత్సరాల చరిత్ర కలిగిన తెనాలి పాత గవర్నమెంట్ హాస్పిటల్ ప్రాంగణంలోనే, ఇప్పటికే ఏర్పాటు చేసిన అర్బన్ హెల్త్ ప్రైమరీ సెంటర్ పక్కనే ఈ నూతన ఆయుష్ హాస్పిటల్ నిర్మాణం చేపడతామని మంత్రి తెలిపారు. ప్రస్తుతం పాత భవనం శిథిలావస్థలో ఉండటంతో, ఆ ప్రాంగణాన్ని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా వినియోగించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. నూతన ఆయుష్ హాస్పిటల్లో ప్రత్యేక అవుట్ పేషెంట్ విభాగం 50 పడకల ఇన్ పేషెంట్ సౌకర్యం, ఆధునిక ల్యాబొరేటరీలు అందుబాటులో ఉంటాయని మంత్రి తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నర్సింగ్ కాలేజ్ ఏర్పాటు చేసే అవకాశమూ ఉందన్నారు. సామాన్య ప్రజలకు సులభంగా, అందుబాటులో ఉండే విధంగా ఆయుర్వేద వైద్య సేవలు అందించడమే ఈ ఆయుష్ హాస్పిటల్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఆధునిక వైద్యం తో పాటు సంప్రదాయ ఆయుర్వేదాన్ని ప్రజలకు చేరువ చేసే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రయత్నానికి ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఆయన వెంట కమీషనర్ అప్పలనాయుడు, తహసీల్దార్ కె వి గోపాలకృష్ణ, అసిస్టెంట్ సిటీ ప్లానర్ వాణి పలువురు అధికారులు ఉన్నారు.

# దాచేపల్లి లో బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్



**దాచేపల్లి మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా, దాచేపల్లి దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలో బాల్య వివాహ రహిత ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమం నిర్వహించారు. కిశోర వికాస్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బాల్య వివాహాల రద్దు కోసం, బాలికలకు భవిష్యత్తులో జరిగే అనర్ధాలు, ఆరోగ్య సమస్యలు, పుట్టే పిల్లలు రకరకాల ఆరోగ్య సమస్యలు పట్ల ప్రజల్లో చైతన్యం నింపాలని గ్రామ గ్రామాన అంగన్వాడి టీచర్ల ద్వారా ప్రజలను ఒక చోట చేర్చి అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టాలని దాచేపల్లి నగర పంచాయతీ 14 వ వార్డు కౌన్సిలర్ షేక్ షరీఫ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా నారాయణపురం లోని రామాలయం, మసీదు, చర్చిల వద్ద కిశోర వికాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ వరలక్ష్మి, అంగన్వాడీ లు కోలా రాజ్యలక్ష్మి, పులి లక్ష్మి, శారద, కె.వి. లక్ష్మి, పుష్ప, ఖైరున్, బి. శ్రీ లక్ష్మి స్థానిక మహిళలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికులపై వేధింపులు నిలిపివేయాలి

## – ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదర్ రావు



**పిడుగురాళ్ల మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆగస్టు 15 నుండి మొదలుపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విజయవంతం చేయటం కోసం ఆర్టీసీ కార్మికులు రేయ్ అనకా, పగలనకా పనిచేస్తుంటే వారిపై కేసులు బనయించటం మంచిది కాదని, ఇటువంటి విధానాలను రాష్ట్ర ప్రభుత్వం మార్చుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమం చేసేందుకు సంసిద్ధమే అన్నారు. ఈరోజు పల్నాడు జిల్లా ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులుగా ఎస్ కే బాజీని, జిల్లా కార్యదర్శిగా జి తిరుపతరావును ఏకగ్రీవ ఎన్నిక చేయటం జరిగిందని ప్రకటించారు. తదుపరి హ్యాపీ ఫంక్షన్ హాల్ లో కార్మికుల సదస్సు నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్ర అధ్యక్షులు దామోదర్ రావు మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికుల పై జరుగుతున్న వేధింపులను ఆర్టీసీ ఎం డి ద్వారకా తిరుమలరావు దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం కమిటీని నియమించి కార్మికులకు జరుగుతున్న అన్యాయాలపై న్యాయ విచారణ జరిపించి, తగిన న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమం చేయటానికి సిద్ధం అన్నారు. ఉద్యోగులపై పని భారం తగ్గించాలంటే కనీసం 3 వేల అదనపు బస్సులు, కొత్త సిబ్బంది నీ మామకు చేపట్టాలని ప్రభుత్వానికి సూచించారు. ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ అమరావతి రాష్ట్ర నాలుగవ మహాసభలు ఫిబ్రవరి 5న విజయవాడ లో జరుగుతాయని, ఈ మహాసభలో ఉద్యోగులు, కార్మికులు, శ్రేయోభిలాషులు పాల్గొని సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జేఏసీ చైర్మన్ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ.. కార్మికుల న్యాయపరమైన ఇక్కట్ల కారణంగా నిలిచిపోయిన పదవి ఉన్నత సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి నారాయణరావు, వాస్త నాయకులు ఎన్ వి కృష్ణారావు, మందపాటి శంకర్రావు, వాకా వాకా రమేష్, పిడుగురాళ్ల పట్టణ సిపిఐ కార్యదర్శి అక్కెనపల్లి బాలయ్య, పల్నాడు జిల్లా ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా వాసవి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం

## అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి మనోహర్



**తెనాలి మేజర్ న్యూస్ :** వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం స్థానిక శ్రీవాస్తవ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మంత్రి నాదెండ్ల మనోహర్ రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో మంత్రి మనోహర్ కు స్వాగతం పలికారు. మంత్రి మనోహర్ వాసవి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలందరికీ శాంతి, సుఖసమృద్ధి, ఐశ్వర్యాలు కలగాలని ఆకాంక్షించారు. వాసవి అమ్మవారి త్యాగం చిరస్మరణీయమని మంత్రి మనోహర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పలువురు అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

# తాసిల్దార్ ను కలిసిన నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు



**తెనాలి మేజర్ న్యూస్ :** పట్టణ నాయి బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు మంగళవారం తాసిల్దార్ కె వి గోపాలకృష్ణను కలిశారు. 200 యూనిట్ల లలోపు విద్యుత్తు వాడకం ఉన్న సెలూన్ షాపులకు ఉచిత విద్యుత్ పథకం అమలు అయ్యే విధంగా ఆదాయ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కొరకు సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు సంఘ నాయకులు తెలిపారు. చందర్లపాటి సూర్య వెంకటేష్, కొడాలి సుబ్రహ్మణ్యం గండికోట రాజారావు, మున్నంగి సత్య, లింగాల కోటేశ్వరరావు, లక్ష్మీనారాయణ, మాచవరం సుబ్రమణ్యం, సైదులు సాయి తదితరులు ఉన్నారు.

# ఉపాధ్యాయులు ఆ దిశగా కృషి చేయాలి

## – ఎమ్మెల్యే గళ్ళా మాధవీ

**గుంటూరు జిల్లా పరిషత్ మేజర్ న్యూస్ :** ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ చదువుతున్న విద్యార్థులు రానున్న పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవీ సూచించారు. శ్రీనివాసరావుపేటలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ పరిధిలోని ఎయిడెడ్, మున్సిపల్ పాఠశాలల ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనం ఇవ్వాలన్నారు.



## పిట్స్ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



**దుగ్గిరాల మేజర్ న్యూస్ :** దుగ్గిరాల, మండల పరిధిలోని చింతలపూడి గ్రామంలో గల ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి గుంటూరు జిల్లా కూటమి నాయకులు జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు ఏపీ ఐడీసీ అధ్యక్షులు దేగల ప్రభాకర్ రావు, జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు జి. వెంకటేశ్వరరావు ఏఎన్యూ రెక్టార్, ఆర్ శివరామ ప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్ లక్ష్మీనారాయణ హాజరుకాగా, ముందుగా జ్యోతి ప్రజ్వల్వన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ చందు రామారావు, కార్యదర్శి చందు విజయలక్ష్మి, వైస్ చైర్మన్ చందు రోహిత్, చందు విజయ దుర్గ, తెనాలి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ తోటకూర వెంకటరమణ, చందు బాబురావు, కళాశాల ప్రిన్సిపల్స్ డాక్టర్ ఎన్. లక్ష్మీనారాయణ, డాక్టర్ ఎన్ సుజాత, డివిఎస్ ఫణికుమార్, చింతల శ్రీనివాసరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా కళాశాల విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అతిథులను ఆకట్టుకున్నాయి.




## నేటి నుంచి ఎస్ఆర్ఎం వర్సిటీలో ఏఎంఆర్ నెట్ వర్క్ సమావేశం

**- హాజరుకానున్న ఇండియా - యూకే నిపుణులు**



**మంగళగిరి మేజర్ న్యూస్ :** ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో బుధవారం నుంచి ఇండియా-యూకే దేశాల పరిశోధనా రంగ నిపుణులతో యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) పై ప్రత్యేక సమావేశం జరుగనుంది. ఈ కీలక సమావేశానికి ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ అతిధ్యమిస్తోంది. ఏఎంఆర్ వాడకం, వ్యాధి నిరోధకతపై పరిశోధనలు, వీటిని ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన ప్రణాళికల రూపకల్పనం కోసం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సమావేశానికి ఇండియా, యూకే దేశాల నుంచి పరిశోధకులు, వైద్యులు, పశువైద్య రంగ నిపుణులు, ప్రజారోగ్య ప్రముఖులు హాజరవుతున్నారు. ఏఎంఆర్ పై ఈ రెండు దేశాల నిపుణుల మధ్య సహకారం పెంపొందిచడమే సమావేశపు ప్రధాన ఉద్దేశమని సమావేశ పర్యవేక్షకులు డాక్టర్ జయశీలన్ మురుగయ్యన్ పేర్కొన్నారు. యూకే లోని లీడ్స్ యూనివర్సిటీ నుంచి డాక్టర్ సువర్ణ మిత్రా, డాక్టర్ మహుదా రాస్, బోస్ ఇనిస్టిట్యూట్ అండ్ యూనివర్సిటీ ఆఫ్ ఖుర్వాన్ నుంచి డాక్టర్ జమూర్ ఘోష్, ఎస్ఆర్ఎం ఇనిస్టిట్యూట్ నుంచి డాక్టర్ శోభనలు ప్రత్యేక ఆహ్వాని తులుగా సమావేశానికి విచ్చేస్తున్నట్లు వివరించారు. అంతేకాకుండా సీఎస్ఐఆర్ (నాగ్ పూర్), ఢిల్లీ జేఎస్టీయూ, ఐఐటీ కాన్పూర్, జిందాల్ యూనివర్శిటీ, చెన్నై కెన్సర్ ఇనిస్టిట్యూట్ నుంచి నిపుణులు కూడా హాజరవుతున్నారని డాక్టర్ జయశీలన్ వివరించారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ



**దుగ్గిరాల మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పెనుమూలి గ్రామానికి చెందిన అన్నాబత్తుని విజయలక్ష్మికి మంత్రి నారా లోకేష్ చొరవ తోముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న విజయలక్ష్మి కి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 3, 0 5,389 రూపాయల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్.వో.సి) చెక్కును తెలుగుదేశం పార్టీ నాయకులు బాధితురాలకుటుంబ సభ్యులకి అందజేశారు. మండల పార్టీ అధ్యక్షులు కేసం నేని శ్రీ అనిత, కే.సంనేని వాసు బాబు తదితరులు పాల్గొని మంజూరు పత్రాన్ని అందజేశారు.

## పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపర్చండి

**- కమీషనర్ అప్పలనాయుడు**



**తెనాలి మేజర్ న్యూస్ :** మున్సిపల్ కమీషనర్ అప్పలనాయుడు పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం పర్యటించారు. పలు ప్రాంతాల్లో డ్రెయిన్లను పరిశీలించారు. డ్రైయిన్లల్లో వ్యర్థాలు తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణ మెరుగుపర్చాలని ఆదేశించారు. బుర్రిపాలెం రోడ్డులోని డంపింగ్ యార్డును పరిశీలించారు. వ్యర్థాల తరలింపుపై అధికారులకు పలు సూచనలు, సలహాలు అందించారు. బోడురోడ్డులోని డ్రెయిన్లను పరిశీలించారు. అనంతరం ఐతానగర్ లోని పైకస్ పార్కును సందర్శించారు. పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మొక్కల సంరక్షణపై సూచనలు చేశారు. ఆయన వెంట పలువురు అధికారులు ఉన్నారు.

# ఇంటర్మీడియట్ పరీక్షలు సజావుగా నిర్వహిద్దాం

**- అధికారుల సమీక్షలో కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా**



**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు సజావుగా జరిగేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పటిష్ట ప్రణాళిక ప్రకారం అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో ఇంటర్మీడియట్ పరీక్షల సన్నద్ధత, నిర్వహణ పై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షలకు సంబంధించిన కాన్ఫిడెన్షియల్ మెటీరియల్ స్టోరేజ్ సెంటర్, డిస్టిబ్యూషన్ సమయంలో సాయుధ పోలీస్ లతో పటిష్ట బందోబస్తు ఏర్పాటుకు పోలీస్ శాఖ చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి, సమీప ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్లు మూసివేయించాలని, పోలీస్ శాఖతో అవసరమైన బందోబస్తు ఏర్పాటు కు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటర్మీడియట్ శాఖ, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులతో ఫ్లైయింగ్ స్క్వాడ్ లు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పారిశుధ్యం పనులు, మంచినీటి ఏర్పాటుకు మున్సిపల్, పంచాయితీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాలు వద్ద వైద్యశిబిరాలు ఏర్పటు చేసి వేసవి దృష్ట్యా డీహైడ్రేషన్ కు సంబంధించిన మందులు అందుబాటులో ఉండేలా వైద్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల విద్యార్థుల అవసరం మేరకు బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. పరీక్షల సమయంలో విధ్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జవాబు పత్రాలను ఆలస్యం లేకుండా వెంటనే పోస్ట్ చేసేలా పోస్టల్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో సమస్యాత్మకంగా గుర్తించిన పరీక్ష కేంద్రాలు వద్ద ప్రత్యేక దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షలలో మాల్ ప్రాక్టీస్, కాపీయింగ్ జరగకుండా ఇంటర్మీడియట్ శాఖ, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు సమన్వయంతో పర్యవేక్షించాలన్నారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు వ్రాసేలా పరీక్ష కేంద్రాల్లో అవసరమైన మౌలిక సౌకర్యాలు పూర్తి స్థాయిలో కల్పించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తో చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటర్మీడియట్ ఆర్ఐఓ. జీ సునీత మాట్లాడుతూ ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు 23.02.2026 నుంచి 24.03.2026 వరకు ఉదయం 09:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు జరుగుతాయని తెలిపారు.. జిల్లాలో మొదటీ సంవత్సరం విద్యార్థులు 34,778 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 31,478 మంది, ద్వితీయ సంవత్సరం బ్యాక్. లాగ్ విద్యార్థులు 834 మంది, మొదటీ సంవత్సరం వోకేషనల్ విద్యార్థులు 707 మంది, రెండవ సంవత్సరం వోకేషనల్ విద్యార్థులు 706 మంది, ద్వితీయ సంవత్సరం వోకేషనల్ బ్యాక్. లాగ్ విద్యార్థులు 448 మంది మొత్తం 68,951 మంది విద్యార్థులు 87 పరీక్షా కేంద్రాల్లో ఇంటర్మీడియట్ పరీక్షలు వ్రాయనున్నారని వివరించారు. ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు 01.02.2026 నుంచి 10.02.2026 వరకు 126 పరీక్ష కేంద్రాల్లోను, ఇంటర్మీడియట్ ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు 27.01.2026 నుంచి 10.02.2026 వరకు 17 పరీక్ష కేంద్రాల్లోను జరగనున్నాయని తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు 27,960 మంది, ఇంటర్మీడియట్ ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలకు 2,292 మంది విద్యార్థులు హాజరుకానున్నారని చెప్పారు. అదేవిధంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు బుధవారం (21.01.2026) నైతిక విలువల సబ్జెక్టుపై, శు క్రవారం (23.01.2026) పర్యావరణం సబ్జెక్టు పై పరీక్షలు జరుగుతాయని తెలిపారు. సమావేశంలో ఈస్ట్ డీఎస్పీ అరవింద్, ఇంటర్మీడియట్ ఆర్ జె డీ పద్మ, ఎపిసిపిడిసిఎల్ ఈఈ నాగేశ్వరరావు, ఆర్టీసీ డీపో మేనేజర్ ఎం రామకృష్ణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సూపర్వైజర్ నాగవర్ధన్, పోస్టల్ డిపార్ట్మెంట్ పీఆర్ఐ లు వై మాధవరావు, చెన్నకేశవులు, డిఈసీ సభ్యులు జి సిరిల్ పాల్, జానకి రామయ్య, సుబ్బారావు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## శంకర్ విలాస్ ఆర్ఓబి నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయనున్నాం

**- ప్రాంతాలను పరిశీలన నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, నగర కమిషనర్ కె.మయూర్ అశోక్**



**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** గుంటూరు నగరానికి కీలకమైన శంకర్ విలాస్ ఆర్ఓబి నిర్మాణ పనుల్లో నగరపాలక సంస్థకు సంబంధించిన పనులను యుద్ద ప్రాతిపదినక పూర్తి చేయనున్నామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. మంగళవారం నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ తో కలిసి శంకర్ విలాస్ ఆర్ఓబి నిర్మాణ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ శంకర్ విలాస్ ఆర్ఓబి నిర్మాణం నిర్దేశిత గడువులోగా జరిగేలా కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ నిత్యం సమీక్షిస్తున్నారన్నారు. నిర్మాణ సంస్థ పనులు చేపట్టడానికి వీలుగా సైట్ క్లియర్ చేసి ఇవ్వాల్సిన భాధ్యత జిఎంసిపై ఉన్నందున, ఆ దిశగా అధికారులు కృషి చేయాలన్నారు. ఇప్పటికే పలుదఫాలుగా ప్రభావిత భవన యజమానులతో సమావేశాలు ఏర్పాటు చేశామని, బుధవారం కూడా వారితో కమిషనర్ నేతృత్వంలో మరో సమావేశం నిర్వహిస్తామన్నారు. కమిషనర్ తొలుత ఆర్ఓబి నిర్మాణ పరిధి, ఎన్ని భవనాలు ప్రభావితం అవుతున్నదీ, ఇప్పటి వరకు తొలగించినవి, కోర్ట్ కేసులు తదితర అంశాలను సమగ్రంగా అధికారులను అడిగి తెలుసుకుని మాట్లాడుతూ బ్రాడీపేట వైపు పెండింగ్ లో ఉన్న పిల్లర్లలో ఒక పిల్లర్ నిర్మాణంకు సైట్ క్లియర్ గా ఉన్నందున పనులు చేపట్టవచ్చున్నారు. అంగీకారం తెలిపిన భవనాలను తక్షణం తొలగించి మిగిలిన వారి సమస్యలు, అనుమానాలను తెలుసుకుని పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. ఆర్ఓబి పనులు పూర్తయ్యే వరకు జిఎంసి పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ నెలలో జిజీహెచ్ లో నూతన భవన ప్రారంభానికి రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరు కానున్న నేపథ్యంలో, పర్యటన మార్గంలో ప్రత్యేక పారిశుధ్య పనులు, ఆక్రమణల తొలగింపు, రోడ్లపై ప్యాచ్ వర్క్ ల మరమత్తు చేపట్టాలని ఆయా అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో సిటి ప్లానర్ రాంబాబు, ఎస్ఈ వెంకటేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, ఈఈ వేణుగోపాల్, డిసిపి సూరజ్ కుమార్, ఎసిపి రెహ్మాన్, కార్పొరేటర్ వరప్రసాద్, ప్రజారోగ్య, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

# రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్

**- 1086 మంది బాలికలకు వ్యాక్సిన్**






**మంగళగిరి మేజర్ న్యూస్ :** మంగళగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. మంగళవారం స్థానిక నిడమర్రు రోడ్డులోని అరవింద మోడల్ స్కూల్ పక్కనే గల మహాలక్ష్మి గ్రౌండ్ లో వ్యాక్సినేషన్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వ్యాక్సినేషన్ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ ఎస్.వి.రాంప్రసాద్, పీడీజీలు వడ్లమాని రవి, తాళ్ల రాజశేఖర్ రెడ్డి, డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్ఐడి 3011 వందన భళ్ల, మంగళగిరి - తాడేపల్లి నగరపాలకసంస్థ కమిషనర్ ఎస్.అలీంబాషా, డాక్టర్ వాసుదేవ చతుర్వేది విచ్చేశారు. మంగళగిరి రోటరీ క్లబ్ చేపట్టిన ప్రతిష్టాత్మక సర్వీసు ప్రాజెక్టు... ఉచిత సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రశంసించి, రొటేరియన్లకు అభినందనలు తెలిపారు. మంగళగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 9నుంచి 14 సంవత్సరాలలోపు బాలికలకు సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్ ను ఉచితంగా అందజేశారు. మొత్తం 1086 మంది బాలికలకు సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్ వేసినట్లు మంగళగిరి రోటరీ క్లబ్ అధ్యక్షుడు ప్రెగడ రాజశేఖర్ తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన ఈ ప్రత్యేక శిబిరానికి మంగళగిరి ప్రాంతంలోని వివిధ పాఠశాలల విద్యార్థినులు హాజరై వ్యాక్సిన్ వేయించుకున్నారు. అందరికీ స్నాక్స్ అందించే ఏర్పాటుచేశారు. ప్రముఖ క్యాన్సర్ వైద్యనిపుణులు డాక్టర్ టి.మహతి వ్యాక్సినేషన్ సందర్భంగా వైద్య సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగు సూచనలు చేశారు. డీఎంహెచ్వో డాక్టర్ కె.విజయలక్ష్మి ఆదేశాల మేరకు ఇందిరానగర్, రామచంద్రాపురం, కుప్పురావుకాలనీ యూపీహెచ్ సీ వైద్యాధికారులు డాక్టర్ పరుచూరి అనూష, డాక్టర్ చండీప్రియాంక, డాక్టర్ శ్రీనివాస్, వైద్యసిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు సేవలందించారు. అలాగే, ఎయిమ్స్ నర్సింగ్ ట్యూటర్లు పి.అవంతీదేవి, ఎం.ప్రియ ఆధ్వర్యంలో నర్సింగ్ విద్యార్థినులు బాలికలకు వ్యాక్సిన్ వేయడంలో సహకారం అందించారు. మంగళగిరి రోటరీ క్లబ్ అధ్యక్షుడు ప్రెగడ రాజశేఖర్, కార్యదర్శి పారేపల్లి నిరంజన్ గుప్తా, కోశాధికారి కేవీఎస్ ప్రకాశరావు, ప్రాజెక్టు చైర్ అనిల్ చక్రవర్తి ఇసునూరు, ప్రాజెక్టు శక్తి కార్యదర్శి గాజుల శ్రీనివాసరావు, సర్వీస్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ చనుమోలు గోపాల్, పలువురు రొటేరియన్లు పర్యవేక్షించారు.

# సమిష్టి కృషితో కోటప్పకొండ తిరుణాళ్ళను విజయవంతం చేద్దాం

## ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు , కలెక్టర్ కృత్తికా శుక్ల

- కోటప్పకొండ తిరుణాళ్ళ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం
- ఎమ్మెల్యే అరవింద బాబు, కలెక్టర్ కృత్తికా శుక్ల ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం









**నరసరావుపేట రూరల్ మేజర్ న్యూస్ :** ప్రముఖ శైవ క్షేత్రమైన కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి వార్షిక తిరుణాళ్ళ ఉత్సవాలు ఫిబ్రవరి 15వ తేదీన ఘనంగా నిర్వహించనున్న నేపథ్యం లో కోటప్పకొండపై శాఖల వారీగా చేపట్టనున్న ముందస్తు ఏర్పాట్లు, అభివృద్ధి కార్యక్రమాలపై నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు, జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్ల మంగళవారం సాయంత్రం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుణాళ్ళ సమయంలో లక్షలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశమున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర వైద్య సేవలు, పారిశుద్ధ్య నిర్వహణ, త్రాగునీటి సరఫరా, విద్యుత్ సౌకర్యాలు, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు, అగ్నిమాపక శాఖ సిద్ధత తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో విస్తృతంగా చర్చించారు.

### పటిష్ట పోలీస్ బందోబస్తు ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అరవింద బాబు అధికారులను ఆదేశించారు. కోటప్పకొండకు వచ్చే ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడకుం డా ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేయడంతో పాటు, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలు కేటాయించాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు.

### అత్యవసర వైద్య సేవలు అంబులెన్సులు సిద్ధంగా ఉండాలి

తిరుణాళ్ళ సందర్భంగా అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వైద్య శిబిరాలు, అంబులెన్సులు సిద్ధంగా ఉంచాలని, అవసరమైన మందులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కృత్తికా శు క్ల ఆదేశించారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులకు ప్రత్యేక వైద్య సహాయం అందించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్‌పై ప్రత్యేక దృష్టి పారిశుద్ధ్య పనులు నిరంతరం కొనసాగించేలా ప్రత్యేక సిబ్బందిని నియమించాలని, చెత్త తొలగింపుకు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా ట్యాంకర్లు, వాటర్ పాయింట్లు ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరఫరాకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, జనరేటర్లు సిద్ధంగా ఉంచాలని సమావేశంలో నిర్ణయించారు.

### డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ఈనెల 22వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కోటప్పకొండకు రానున్న నేపథ్యంలో చేపట్టిన వెలిపాడ్, భద్రతా ఏర్పాట్లను ఎమ్మెల్యే అరవింద్ బాబు, కలెక్టర్ కృత్తికా శుక్ల కలిసి పరిశీలించారు. హెలిప్యాడ్, వీఐపీ రూట్, భద్రతా చర్యలపై పోలీస్ అధికారులతో ప్రత్యేకంగా చర్చించి తగిన సూచనలు చేశారు.

### సామాన్య భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం లక్ష్యం

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు మాట్లాడుతూ, కోటప్పకొండ తిరుణాళ్ళ రాష్ట్రవ్యాప్తంగా పేరుగాంచిన ఉత్సవమని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గత సంవత్సరం 25 లక్షల మంది భక్తులు కోటప్పకొండ తిరుణాళ్ళకి వచ్చారని ఈ సంవత్సరం భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి తిరుణాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం తరఫున అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కొత్తపాలెం నుండి కోటప్పకొండ వరకు నిర్మించిన నూతన రహదారిని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పరిశీలించారు డిప్యూటీ సీఎం రోడ్డును ప్రారంభించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సమావేశంలో పోలీస్, రెవెన్యూ, వైద్య, విద్యుత్, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, అగ్నిమాపక శాఖల అధికారులు, ఆలయ ఈవో, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మర్పణం

- గుండ ప్రవేశం సందర్భంగా ఘనంగా ప్రత్యేక పూజలు
- అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు





**నరసరావుపేట మేజర్ న్యూస్ :** నరసరావుపేట పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారి ఆత్మర్పణం ( గుండ ప్రవేశం ) సందర్భంగా మంగళవారం ఘనంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు పాల్గొని అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పర్వదినాన్ని అధికారిక కార్యక్రమంగా ప్రకటించిన నేపథ్యంలో ప్రభుత్వ తరఫున ఎమ్మెల్యే అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించడం విశేషంగా నిలిచింది. అనంతరం ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక హోమాలు, అభిషేకాలు, అర్చనలు, మంగళ హారతులలో ఎమ్మెల్యే పాల్గొని అమ్మవారి దివ్య ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మర్పణం త్యాగానికి, ధర్మానికి ప్రతీకగా నిలుస్తుందని, ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో మంచి విలువలను పెంపొందిస్తాయని తెలిపారు. భక్తులందరికీ అమ్మవారి కృప ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఉదయం నుంచే ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొత్త మాసు మెహర్ బాబు, ఆలయ సెక్రటరీ కొత్త మాసు వెంకటప్పయ్య, ఆలయ ట్రెజరర్ పొత్తూరు వెంకటలక్ష్మి వరప్రసాదరావు, గట్టుపల్లి సత్యనారాయణ, వురా భాస్కరరావు, ఛాంబర్ అఫ్ కామర్స్ అధ్యక్షులు సాంబశివ రావు, ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు, పట్టణ ప్రముఖులు, భక్తులు, పాల్గొన్నారు.

## మరియమ్మ మృతి పట్ల టిడిపి నాయకుల నివాళి



**దాచేపల్లి, మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని 15 వ వార్డులో అనారోగ్యం తో మరణించిన క్రోసూరి మరియమ్మ (81) మృతి సీనియర్ టిడిపి నాయకులు తోట వెంకటేశ్వర్లు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే మంచి వ్యక్తిత్వం గల మనిషి మరియమ్మ అని ఎన్నికల సమయంలో ఎవరికైనా మాట ఇస్తే ఎంత కష్టమొచ్చినా వారికి మద్దతు గా నిలబడుతుందని తోట గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా మరియమ్మ కుమారుడు స్పేర్ షిప్ ను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారి లో తోట వెంకటేశ్వర్లు తో పాటు నాయకులు, నరసింహా నాయక్ లు ఉన్నారు.

## గురజాలలో కార్డాన్ సెర్చ్, కొడవల్లో గొడ్డలి వదిన



**గురజాల మేజర్ న్యూస్ :** గురజాల వెంకటరమణ కాలనీలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు డిఎస్పి జగదీష్ నేతృత్వంలో రౌడీషీటర్లు అనుమానితులపై నిఘా పెట్టి తనిఖీలు చేశారు పత్రాలు లేని 41 ద్విచక్ర వాహనాలు కొడవళ్ళు ఇనుప రాడ్లు గడ్డపారలు గొడ్డళ్ల కత్తులు, కర్రలు స్వాధీనం చేశారు గ్రామస్తులతో సమావేశమై అవగాహన కల్పించి గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు పోలీసులు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు

## కన్న తండ్రిని పట్టించుకోని కుమారులు

**గురజాల మేజర్ న్యూస్ :** నాగేండ్ల మంగయ్య కాస్ట్/ చౌదరి అనే 80 సంవత్సరాలు వృద్ధునికి ముగ్గురు కుమారులు గలరు. శేషయ్య, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు వీళ్ళకి ప్రతి ఒక్కరికి మూడు ఎకరాలు చొప్పున పొలం ఇచ్చానని ప్రస్తుతం తన ఇల్లు తన వాటా పొలం డబ్బులు తీసుకున్నారు కానీ తనను పట్టించుకోవట్లేదు అని తనకి పూటకి అన్నం పెట్టట్లేదని జూస్త్రతీం పిటిషన్ పెట్టగా గురజాల డిఎస్పీ జగదీష్ గారు గురజాల టౌన్ సిఐ ఏ భాస్కర్ చర్లగుడిపాడు వచ్చి ఆయన విచారించడం జరిగినది.



## ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాలలో టెక్నాలజీ రెడీనెస్ లెవల్ పై నిపుణుల ఉపన్యాసం



**నరసరావుపేట రూరల్ మేజర్ న్యూస్ :** నరసరావుపేట స్థానిక కేసానుపల్లి లోని ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆద్వర్యంలో "టెక్నాలజీ రెడీనెస్ లెవల్ (టి.ఆర్.యల్) అనే అంశము పై నిపుణుల ఉపన్యాస కార్యక్రమాన్ని డా. ఏ.పి. జె. అబ్దుల్ కలాం ఆడిటోరియంలో నిర్వహించి నట్లు ప్రిన్సిపాల్ డా. జి నాగమల్లేశ్వర రావు తెలియచేశారు. ఈ కార్యక్రమా నికి వలివేటి రామ్మోహన్ రావు, సి.ఈ.ఓ వెన్సిట్ కార్ప్ న్యూ జెర్సీ, యు.యస్.ఏ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ప్రేరణాత్మక ప్రసంగంతో పాటుగా, విలువైన సమాచారాన్ని అందచేశారు. ఆయన తన సందేశంలో టెక్నాలజీ రెడీనెస్ లెవల్ భావనను వివరించి, పరిశోధన దశ నుంచి పరిశ్రమ స్థాయికి సాంకేతికతను తీసుకెళ్లడంలో టి.ఆర్.యల్ ప్రాముఖ్యతను విశదీకరించారు. అంతే కాకుండా పరిశ్రమ విద్యాసంస్థల అనుసంధానం, ఆవిష్కర ణలు మరియు ఉత్పత్తి అభివృద్ధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ డా. జి. నాగ మల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథం మరియు ఔత్సాహికత పెంపొందించడంలో ఇలాంటి నిపుణుల ఉపన్యాసాల అవసరం అని పేర్కొన్నారు. ఎస్.కె. కరీం మొహిద్దీన్, సెక్రటరీ & కరస్పాండెంట్ డా. మస్తాన్ షరీఫ్ షేక్ మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినందుకు ఐఐసీ బృందాన్ని అభినందించి, భవిష్యత్తులోనూ ఇలాంటి ఆవిష్కరణలు, పరిశోధన మరియు పరిశ్రమ సహకార కార్యక్రమాలకు పూర్తి మద్దతు అందిస్తామని తెలిపారు. కళాశాల అధ్యాపకు లు, పరిశోధకులు, వివిధ విభాగాల విభాగాది పతులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారని ఐ.ఐ.సి కన్వీనర్ డా. షేక్ ముజీర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఎస్.కె. మీరవలి, ప్రిన్సిపాల్ డా. జి నాగమల్లేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.కె.నజీమా పాల్గొన్నారు..

ఎన్.లక్ష్మినారాయణ, రీజనల్ మేనేజర్, ఫోన్ నెం. 63011 07116

# ప్రజా సమస్యల పరిష్కారం కోసం నేడు చీఫ్ విప్ జీవీ ప్రజాదర్బార్



**వినుకొండ మేజర్ న్యూస్ :** వినుకొండ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికై బుధవారం ప్రభుత్వ చీఫ్ విప్ కార్యాలయశీ లో 'ప్రజాదర్బార్' నిర్వహిస్తున్నట్లు కార్యాలయ వర్గాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపాయి. ప్రజా దర్బార్ కు ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు ముఖ్య అతిధులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. ఉదయం 09.30 గంటల నుంచి మధ్యాహ్నం 01:00 గంట వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని వెల్లడించారు. ఈ సందర్భంగా సమస్యలు ఉన్నవారు నేరుగా చీఫ్ విప్ జీవీని కలసి సమస్యలు వివరించవచ్చని ఆయన కార్యాలయం ప్రతినిధులు సూచించారు. వినుకొండ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని 5మండలాల నుంచి ప్రజలు ప్రజాదర్బార్ కు తరలివచ్చి ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరి వద్ద విజ్ఞాపన పత్రాలు చీఫ్ విప్ జీవి స్వయంగా స్వీకరించి సాధ్యమైనంత మేరకు తక్షణమే పరిష్కారాలు చూపిస్తారని పేర్కొన్నారు. మిగిలిన వాటికి వినతుల ద్వారా వచ్చే సమస్యలు ఇక్కడి నుంచే విభాగాల వారీగా విభజించి సంబంధిత శాఖలకు పంపి పరిష్కారానికి కృషి చేస్తారన్నారు.

# ఏపీఐఐసీ ఎదుట ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల ధర్నా



**మంగళగిరి, మేజర్ న్యూస్:** మంగళగిరి ఆటోనగర్ లోని ఏపీఐఐసీ కార్యాలయం ఎదుట ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు మంగళవారం ధర్నా నిర్వహించారు. గత నాలుగు సంవత్సరాలుగా తమకు రావలసిన రాయితీలను విడుదల చేయకుండా కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తుందని ధ్వజమెత్తారు. ఈ ధర్నాకు రాష్ట్ర నలుమూలల నుండి వందలాది మంది ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు తరలివచ్చారు. గతంలో మూడు సార్లు సచివాలయం ముట్టడి, అనేకసార్లు ఏపీఐఐసీ వద్ద ధర్నాలునిర్వహించినప్పటికీ ఏదో ఒక విధంగా రాష్ట్ర ప్రభుత్వం మభ్యపెడుతూ వస్తుందని విమర్శించారు. సబ్సిడీలు విడుదల చేసేదాకా చావనైనా చస్తాం... కానీ ఇక్కడ నుంచి కదిలేది లేదని స్పష్టం చేశారు. అవసరమైతే ఆత్మహతి కైనా తాము సిద్ధంగా ఉన్నామని మహిళా పారిశ్రామికవేత్తలు తమ ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎనిమిది నెలల నుంచి అనేక విధాలుగా పోరాటాలు చేసినప్పటికీ గత అక్టోబర్ నెలలో కొంతమందికి 20 శాతం మాత్రమే విడుదల చేసి చేతులు దులుపుకున్నట్లు వారు పేర్కొన్నారు. 50 శాతం మందికి పైగా పారిశ్రామికవేత్తలకు రాయితీలు అసలు విడుదల కాలేదన్నారు. లిస్టులో కొంతమంది పేర్లు కూడా లేవని, ఆ పేర్లు ఎక్కడ మాయమయ్యాయని వారు ప్రశ్నించారు. దళిత పారిశ్రామికవేత్తలకు రావలసిన ఎస్సీ, కాంపోనెంటు, ఎస్టీ కాంపోనెంట్ ప్రణాళికను ప్రకారం నిధులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానికంగా ఉండే పారిశ్రామికవేత్తలకు రాయితీలను ఇవ్వకుండా విదేశాల నుంచి ఇక్కడకు వచ్చి పరిశ్రమలు పెట్టే వారికి రాయితీలు ఇస్తామనడం ఏమాత్రం న్యాయమని వారు ప్రశ్నించారు. సబ్సిడీలు విడుదల చేసేంతవరకు ఇక్కడ నుంచి కదిలేది లేదన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ డైరెక్టర్ రామలింగరాజు పలుగురు జేఏసీ నాయకులతో చర్చలు జరిపారు. ఇప్పటివరకు నిధులు విడుదల కాని వారికి ముఖ్యమంత్రి, ఐటీ శాఖ మంత్రి,, పరిశ్రమల శాఖ మంత్రి,, ప్రిన్సిపల్ సెక్రెటరీ దావోస్ వెళ్లి ఉన్నందున తాము ఇంతకుమించి నిర్ణయం తీసుకోలేమని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు అనార్ బాబు మాట్లాడుతూ నూటికి నూరు నిధులు విడుదల చేయనట్లయితే ఇక్కడి నుంచి కదిలేది లేదని స్పష్టం చేశారు.. శాంతియుతంగా ఈ ధర్నా తలపెట్టినట్లు తెలిపారు. జాయింట్ సెక్రెటరీ పెనుమాల నాగ కుమార్ మాట్లాడుతూ... శాంతియుతంగా చేస్తున్న ధర్నాను పోలీసులు అడ్డుకోవడం దారుణమన్నారు. మహిళా నాయకురాలు కారెం సత్యనారాయణమ్మ మాట్లాడుతూ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్..మాట ఇచ్చి తప్పడం వలన తాము తిరిగి ఈ ధర్నాకు పూనుకోవాల్సి వచ్చిందని తెలిపారు. ఎస్సీ, ఎస్ టి లకు అన్యాయం చేసిన ఏ ప్రభుత్వము బతికి బట్ట కట్టలేదని ఆమె స్పష్టం చేశారు.. సబ్ ప్లాన్ నిధుల ద్వారా తమకు రావలసిన నిధులు విడుదల చేయాలని కోరారు. మరో నాయకురాలు పాలా నాగలక్ష్మి మాట్లాడుతూ రాయితీలు విడుదల చేసే దాకా ఇక్కడ నుంచి కదిలేది లేదన్నారు. విడుదల చేయకపోతే ఏపీఐఐసీ బిల్డింగ్ పై నుండి దూకి చావనైనా చస్తావంగానే ఇక్కడ నుంచి కదిలేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జంగా త్రిమూర్తులు, చిన్న మౌలాలి, ఇంకా వరికూటి నీరజ,, డాక్టర్ మద్దాల బిందు, రాష్ట్ర నాయకులు కనపర్తి విజయరాజు,, సరిహద్దు దయాకర్,,కొడాలి రాంబాబు, జగదీష్,, వి భక్తవత్సలం తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన వజ్జా శ్రీనివాసరావు

**మంగళగిరి, మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్‌గా వజ్జా శ్రీనివాసరావు మంగళవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, తనకు ఈ కీలక బాధ్యతను అప్పగించిన రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి,మంత్రివర్గం మరియు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కృతజ్ఞతలు తెలిపారు. సమాచార హక్కు చట్టం 2005 ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన చట్టమని పేర్కొన్న ఆయన, ప్రజలకు సమాచారంపై హక్కు కల్పించడం, పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడం ఈ చట్టం యొక్క ప్రధాన ఉద్దేశమని తెలిపారు. రాష్ట్ర సమాచార కమిషన్ ఒక స్వతంత్ర, నిష్పక్షపాత సంస్థగా పనిచేస్తుందని, చట్టాన్ని మాత్రమే ప్రమాణంగా తీసుకొని నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సాధారణ పౌరుడు అడిగే సమాచారం చట్టబద్ధంగా ఉంటే, అతనికి అది తప్పకుండా అందేలా చూడటం కమిషన్ బాధ్యత అని పేర్కొన్నారు. ఆర్టిఐ చట్టం అధికారులను భయపెట్టే చట్టం కాదని, పాలనలో విశ్వసనీయతను పెంచే సాధనంగా దీన్ని చూడాలన్నారు. సమాచార అధికారులు చట్టాన్ని సక్రమంగా అమలు చేసేలా అవగాహన కల్పించడంపై కూడా కమిషన్ దృష్టి సారిస్తుందని తెలిపారు. అలాగే సమాచార హక్కు చట్టం కింద దాఖలైన పెండింగ్ అప్పీలు, ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించేందుకు ప్రాధాన్యం ఇస్తామని, ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజాస్వామ్యంలో మీడియా కీలక పాత్రను గుర్తుచేసిన వజ్జా శ్రీనివాసరావు, సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో అవగాహన పెంచడంలో మీడియా సహకారం అవసరం అని పేర్కొన్నారు. ప్రజల హక్కుల పరిరక్షణ, చట్టానికి సంపూర్ణ విధేయత, పారదర్శక పాలన అనే సూత్రాలతో తన బాధ్యతలను నిర్వర్తిస్తానని ఆయన స్పష్టం చేశారు.



## 65 లక్షలతో జల జీవన మిషన్ పనులు, ఆర్డబ్ల్యూఎస్ డీ.ఈ.ఈ వెంకటేశ్వర్లు




**మాచవరం , మేజర్ న్యూస్ :** మాచవరం మండలంలోని చెన్నాయపాలెం గ్రామపంచాయతీ యందు జల్ జీవన్ మిషన్ నిధులు కింద మంజూరు అయినా రు: 65.00 లక్షలతో, గ్రామంలో 6000 మీటర్లు పైపులైన్లు పూర్తిచేసి, ఆ పైప్ లైనుల పైన 716 ఇంటింటికి ఉచిత కుళాయిలు ఇవ్వడం జరిగినది. ఆర్డబ్ల్యూఎస్ డి ఈ ఈ.వెంకటేశ్వర్లు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తి అయిన ఆ పనిని భవిష్యత్తు నిర్వహణ కొరకు గ్రామీణ నీటి సరఫరా శాఖ నుండి చెన్నాయపాలెం గ్రామపంచాయతీ వారికి అప్పగించే సందర్భంగా " జల్ అర్పన్ దివాస్ " కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఎంపీడీవో విష్ణు చిరంజీవి మాట్లాడుతూ భాగముగా గ్రామంలో ముగ్గుల పోటీలు, జల్ బంధన్, మానవహారం, ట్రాన్సిట్ వాక్ ( ర్యాలీ) నిర్వహించడం జరిగినది. తదుపరి గ్రామసభ ఏర్పాటు చేసి గ్రామ ప్రజలకు నీటి యొక్క ఆవశ్యకత మరియు జల సంరక్షణలో ప్రజలందరూ భాగ్యస్వాములు కావాలని కోరుతూ పిలుపునివ్వడం జరిగింది. చివరగా ముగ్గులు పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పాల్గొన్న వారందరికి కన్సోలేషన్ బహుమతులు ఇవ్వడం జరిగింది. " జల్ సంరక్షణ – ప్రజలందరి బాధ్యత" అనే నినాదం ఇవ్వడం జరిగింది. వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రజలందరూ నీటిని జాగ్రత్తగా వృధా కాకుండా వాడుకోవలసినదిగా తెలియపరచడమైనది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, ఆర్డబ్ల్యూఎస్ ఏ.ఈ సురేష్ పంచాయతీ సెక్రెటరీ రామ కోటేశ్వరరావు , మండల కోఆర్డినేటర్ లక్ష్మయ్య తదితర సచివాలయం సిబ్బంది గ్రామ సర్పంచ్ మండ్ల మంగమ్మ , టిడిపి నాయకులు , మాజీ సర్పంచ్ బొగ్గవరపు అంజయ్య,గ్రామ ప్రజలు , తదితరులు పాల్గొన్నారు.

## శిరస్త్రాణమే... అపరాధ రుసుము ముప్పాళ్ళ పోలీసుల వినూత్న విధానం



**ముప్పాళ్ళ, మేజర్ న్యూస్ :** అపరాధ రుసుము తో మార్పు రానప్పుడు... ప్రయాణికుల రక్షణ, సంక్షేమంపై ముప్పాళ్ళ పోలీసులు చేసిన సరికొత్త ఆలోచన విధానానికి అన్ని వర్గాల నుంచి హర్షం వ్యక్తం అవుతుంది. హెల్మెట్ లేకుండా మోటారు బైకు నడుపుతున్న వ్యక్తులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, మోటార్ వెహికల్ చట్టం ప్రకారం హెల్మెట్ లేని వాహనదారులకు రూ. 1035 రూపాయలు ఫైన్ విధిస్తూ ఉన్నారు. తరచూ ఇలా ఫైన్ కడుతూ ఉన్న సరే ద్విచక్ర వాహనదారులు మాత్రం హెల్మెట్ వాడటం లేదు. సరి కదా ప్రమాదాల బారిన పడుతూనే ఉన్నారు. ప్రమాదాలను నివారించేందుకు అపరాధ రుసుముకు బదులు గా వాహనదారులకు కొత్త హెల్మెట్లు అదే ధరకు కొని అందిస్తున్నారు. ఈ విధంగా మంగళవారం 11 హెల్మెట్లను ద్విచక్ర వాహందారులచేతే కొనిపించి... సురక్షితమైన ప్రయాణానికి ముప్పాళ్ల ఎస్సై అనిల్ కుమార్ బాటలు వేశారు. ఈ చర్యతో పోలీసుల లక్ష్యం, ప్రయాణికుల రక్షణ ఉభయ కుశలోపరిగా జరిగిందని పలువురు హర్ష వ్యక్తం చేస్తున్నారు.

## మొక్కజొన్న పంటను పరిశీలించిన వ్యవసాయ అధికారులు.

**ముప్పాళ్ళ, మేజర్ న్యూస్ :** పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా ముప్పాళ్ళ మండల వ్యవసాయ అధికారి ఎస్ శ్రీధర్ రెడ్డి గోళ్ళపాడు, కుందురు వారి పాలెం లోని మొక్కజొన్న పంట పొలాలను పరిశీలించడం జరిగినది. ఆయా గ్రామాల రైతులతో మాట్లాడుతూ మొక్కజొన్న పంట లో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు మరియు నీటి యాజమాన్యం గురించి తెలియజేయడం జరిగింది. అదేవిధంగా ర బి సీజన్లో సాగు చేస్తున్న పంటలు వివరాలను తప్పనిసరిగా ఈ పంట నందు నమోదు చేసుకోవాలని తెలియజేయడం జరిగింది. మరీ ముఖ్యంగా ర బి సీజన్లో వరి పైరును సాగు చేయు రైతులు నాగార్జునసాగర్ ప్రాజెక్టు కింద వారబంది కొనసాగుతున్నందున నీటి లభ్యతను గమనించి వరి సాగును చేపట్టాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయస్థానాధికారి ఎన్ శేషు బాబు, రైతులు పాల్గొన్నారు.

## బాల్య వివాహరహిత ఆంధ్ర ప్రదేశ్



**మాచవరం, మేజర్ న్యూస్ :** బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం పిడుగురాళ్ల ప్రాజెక్ట్ ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మాచవరంలో నిర్వహించడం జరిగిందని ఐసిడిఎస్ సూపర్వైజర్ ఏ వెంకటలక్ష్మి అన్నారు. మాచవరం మేజర్ పంచాయతీలోని కిస్ ప్రోగ్రాం చర్చిలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు గురించి ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో అంగనవాడి టీచర్ దీవెన , అంగన్వాడి ఆయా టి. అంజమ్మ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## హై వోల్టేజీతో రూ.4 లక్షల విలువైన విద్యుత్ ఉపకరణాలు దగ్ధం



**మంగళగిరి, మేజర్ న్యూస్:** విద్యుత్ సరఫరాలో ఏర్పడిన అవాంతరాలతో మంగళగిరి నగరంలోని 28వ వార్డులో మంగళవారం వేర్వేరు నివాస గృహాల్లో రూ.4 లక్షల విలువైన విద్యుత్ ఉపకరణాలు దగ్ధమయ్యాయి. సమీపంలోని ట్రాన్స్ఫార్మర్ కు సంబంధించిన న్యూటర్ విద్యుత్ వైర్ తెగిపోయింది. దీంతో అకస్మాత్తుగా స్థానిక నివాస గృహాలకు హై వోల్టేజ్ విద్యుత్ సరఫరా రావడంతో వినియోగం లో ఉన్న టీవీలు, ఫ్యాన్లు, లైట్లు, ఫ్రిజ్ లు, తాగునీటి మోటార్లు కాలిపోయాయి. ఎస్.కె జిలాని నివాస గృహంలో రూ. 3 లక్షల విలువైన విద్యుత్ ఉపకరణాలు దగ్ధం కాగా, మరో గృహ యజమాని అనిల్ నివాసంలో రూ . లక్ష రూపాయలు విలువైన విద్యుత్ ఉపకరణాలు దగ్ధమయ్యాయి. మరో కొన్ని నివాసాల్లో సైతం విద్యుత్ ఉపకరణాలు కాలిపోయాయి. మధ్యాహ్నం సంభవించిన ఈ ఘటనతో స్థానిక ప్రజలు భయకంపితులై రహదారుల పైకి పరుగులు తీశారు. సమాచారం అందుకున్న మంగళగిరి అగ్నిమాపక సిబ్బంది విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగిన నివాస గృహాలను సందర్శించి యజమాలకు జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. హై వోల్టేజ్ కారణంగా గృహ యజమానులకు సంబంధించిన విద్యుత్ ఉపకరణాలు దగ్ధమైన ఘటనపై ఏ డి ఈ సురేష్ బాబును వివరణ కోరగా.... నివాస గృహాల్లో విలువైన విద్యుత్ ఉపకరణాలకు హై వోల్టేజ్ సందర్భంలో షార్ట్ సర్క్యూట్ జరగకుండా యజమానులు రక్షణ పరికరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

# పశుపోషకులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

## పాడి పశువుల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు : ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ




**నరసరావుపేట మేజర్ న్యూస్ :** పశుపోషకులకు అండగా నిలుస్తూ పాడి పశువుల ఆరోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు తెలిపారు. నరసరావుపేట పట్టణంలో మంగళవారం ఉదయం ఏర్పాటు చేసిన పశు సంచార వైద్య సేవ కేంద్రం వాహనాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో పశువుకు ఆరోగ్యం బాగాలేని సమయంలో 1962 కాల్ సెంటర్‌కు ఫోన్ చేస్తే వాహనం వచ్చి చికిత్స అందించి వెళ్లేదని, అయితే ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం మరింత మెరుగైన సేవలందించాలనే ఉద్దేశంతో ప్రతిరోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరంతరంగా సేవలందించే విధంగా 104 సంచార పశు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. నేటినుండి పశు సంచార వైద్య సేవ వాహనం మండలంలో ప్రతిరోజు రెండు గ్రామాల్లో ప్రశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని నరసరావుపేట నియోజకవర్గం లో రెండు మండలాలకు రెండు వాహనాలు కేటాయించడం జరిగిందని ఈ వాహనాలు ద్వారా పశుపోషకులకు మెరుగైన వైద్య సేవలు అందించా లన్న లక్ష్యమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పశు పోషకులకు పశువుల ఆరోగ్య సంరక్షణ ఎంతో కీలకమని, పాడి పశువులే రైతులకు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న నేపథ్యంలో ఈ సంచార వైద్య సేవలు ఎంతో ఉపయోగపడతా యని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే చికిత్స అందించడంతో పాటు, వ్యాధి నిరోధక టీకాలు, గర్భ పరీక్షలు, నట్ట నివారణ వంటి సేవలను కూడా ఈ వాహనాల ద్వారా అందిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయం తో పాటు పశు సంవర్ధక రంగానికీ సమాన ప్రాధాన్యత ఇస్తోందని, పశుపోషకుల ఆదాయం పెంచే దిశగా పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సేవలను రైతులు సద్వినియోగం చేసుకుని తమ పశువుల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఏ డి రామచంద్రరావు పశు వైద్యులు శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

# చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న



**– ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్**

**పొన్నూరు మేజర్ న్యూస్ :** అనారోగ్య సమస్యలు, ఆపదలో ఉన్న వారికి ఆర్థికంగా చేయూతను ఇవ్వడంలో కూటమి ప్రభుత్వం ముందు ఉంటుందని పొన్నూరు శాసనసభ్యులు చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అన్నారు. సీఎం సహాయ నిధికి సంబంధించిన రూ. 3,05,513/- రు విలువ గల ఐదు చెక్కులను బాధితులకు ఎమ్మెల్యే అందించారు. దరఖాస్తు చేసిన వెంటనే మానవతా దృక్పథంతో పూర్తిస్థాయిలో సహకారం అందిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ ఎంతో ఖర్చుతో కూడిన చికిత్స చేయించుకోవటం కోసం ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ ను సహాయం కోసం అడిగితే అడిగిన వెంటనే ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా తమకు ఆర్థిక సహాయం అందజేశారని, వారు చేసిన సహాయం ఎప్పటికీ మర్చిపోమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర కుమార్, ముఖ్యమంత్రి కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు భూసార పరిశోధనలపై అవగాహన కార్యక్రమం




**తెనాలి మేజర్ న్యూస్ :** కేంద్రీయ విద్యాలయంలో నేల ఆరోగ్యం, పరిరక్షణ కార్యక్రమం క్రింద మట్టి పరిశోధనలపై అవగాహన కల్పించే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వ్యవసాయ శాఖ, కేంద్రీయ విద్యాలయం సమన్వయంతో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ ఉపాధ్యాయులు, మండల వ్యవసాయ అధికారి సుధీర్ బాబు భూసార పరీక్ష కేంద్రం గుంటూరు వ్యవసాయ అధికారి ఝాన్సీ వాణి అధర్వంలో 8, 9, 10, మొదటి ఇంటర్ విద్యార్థులకు భూసార పరీక్షల ఆవశ్యకత, భూసార పరీక్ష నిర్వహించారు. విద్యార్థులు మట్టి నమూనాలను సేకరించి వాటిని పరీక్ష చేసి భూసార ఫలితాలను మొబైల్ సాయిల్ హెల్త్ కార్డు యాప్ లో పొందుపరచారు. వ్యవసాయ అధికారి సుధీర్ బాబు మాట్లాడుతూ విద్యార్థులలో వ్యవసాయ ఆధారిత కుటుంబ పిల్లలు ఉంటారని అన్నారు. విద్యార్థి దశలోనే భూసార పరీక్ష ఆవశ్యకతను తెలుసుకొని ప్రయోజనాలను కుటుంబ సభ్యులకు తెలిపి భూసార పరీక్ష ఆధారిత ఎరువులను సరియైన మోతాదులో వాడటం వల్ల భూ ఆరోగ్యాన్ని పెంచి అనవసర ఎరువులు వినియోగం తగ్గించడం వలన పెట్టుబడుల ఖర్చులు తగ్గి పంట నికర ఆదాయాన్ని పొందవచ్చునని తెలిపారు. గుంటూరుభూసార పరీక్ష కేంద్రం ఏవో ఝాన్సీ వాణి మాట్లాడుతూ భూసార పరీక్షలు వల్ల సమస్యాత్మక నేలలు గుర్తించి వాటిని సరిచేసుకునవచ్చునని తెలిపారు. నేల పిహెచ్ స్థాయిని తెలుసుకొని ఆమ్ల నేలలో క్షారనేలలో తెలుసుకొనవచ్చునని తెలిపారు.

# విద్యా, ఉద్యోగం, ఉపాధితోనే అభివృద్ధి సంతమాగులూరు ఎంఈఓ కోటేశ్వరరావు



**సత్తెనపల్లి, మేజర్ న్యూస్ :** విద్యా, ఉద్యోగం, ఉపాధితోనే దళిత సామాజిక వర్గాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని సంతమాగులూరు ఎంఈఓ మల్లవరపు కోటేశ్వరరావు అన్నారు. ముప్పాళ్ల మండల పరిధిలోని దమ్మాలపాడు గ్రామంలో ఎడ్యుకేషన్, ఎంప్లాయిమెంట్, ఎంపవర్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, జై భీమ్ జై జీవన్ సేవ ఫౌండేషన్ సౌజన్యంతో " పే బ్యాక్ టు ద సొసైటీ " అంశం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ దళిత వర్గాల వారు జీవిత కాలం శారీరక శ్రమపైనే ఆధారపడుతున్నారని, మేధస్సును ఉపయోగించి ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. వ్యాపార రంగాల వైపు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. సమకాలీన సమాజంతో పేద వర్గాల వారు ఎదగాలంటే చదువు ఒక్కటే సరిపోదని, చదువుతోపాటు నైపుణ్యం, ఉపాధి మార్గాలతో స్వతంత్రంగా జీవించగలిగే విజ్ఞానాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరత ఉందన్నారు. ఇ ఇ ఇ గ్రూపు వ్యవస్థాపకులు రవి రాజా, రత్నరాజు తదితరులు మాట్లాడుతూ ఉన్నతమైన ఆశయాలతో లక్ష్యాలను నిర్దేశించుకు ముందుకు సాగాలన్నారు. ఆసక్తి,కుటుంబ ఆర్థిక పరిస్థితి ని బట్టి పదవ తరగతి తర్వాత గ్రూపులను ఎంపిక చేసుకోవాలన్నారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు మెళకువలను తెలియజేశారు. కార్యక్రమంలో గద్దల ఏసుదాస్, చిలక ఏసుదాసు, పలుకూరి రామారావు,కందుల లాభాను,కందుల శ్రీకాంత్, చింతపల్లి సాల్మన్ ,ఎర్రయ్య తదితరులు ఉన్నారు.

# తాడికొండ పోలీసుల అక్రమ కేసులపై రాష్ట్ర ఎస్సీ కమిషన్ జోక్యం చేసుకోవాలి

## రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కే ఎస్ జవహర్ ను కలిసిన డాక్టర్ పోలరాజు



**గుంటూరు కలెక్టరేట్ మేజర్ న్యూస్ :** తాడికొండ అడ్డ రోడ్డు సెంటర్ లో గల అమ్మ మదర్ తెరిసా స్వచ్ఛంద సేవా సంస్థ కు చెందిన రేకుల షెడ్డును భూ కబ్జాదారులు కూల్చివేశారని తనకు జరిగిన అన్యాయంపై రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ కలిసి వివరించడంతో జిల్లా ఎస్పీకి లేఖ రాయగా భూ కబ్జాదారులపై ఎస్సీ ఎస్టి అట్రాటి కేసు నమోదు చేయడం జరిగిందని విశ్రాంత పోలీస్ అధికారి డాక్టర్ పోలరాజు అన్నారు. ఈ కేసును తుళ్లూరు డిఎస్పి విచారణ చేస్తున్న సమయంలో తన రేకుల షెడ్డును అక్రమంగా తొలగించిన వారిలో ఒకరిని తొలగించేందుకు ఒప్పుకోవాలని నిందితుడి ఎదిటే సిఐ వాసు బలవంతం చేస్తున్నారని ఆరోపించారు. అందుకు బాధితుడు పోలరాజు ఒప్పుకోక పోవడంతో సిఐ వాసు నిందితుడిచేత తనపై తప్పుడు కేసు పెట్టించి దాని ని రిజిస్టర్ చేశారన్నారు. నీవు వారిపై పెట్టిన కేసులు విత్ డ్రా చేసుకుంటేనే నీపై ఉన్న ఈ కేసును తొలగిస్తామని పోలీసులు అంటున్నారని మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్ జవహర్ ను విజయవాడలో పోలరాజు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పోలరాజు మాట్లాడుతూ నాలుగు శతాబ్దల పాటు పోలీసు శాఖలో సేవలను అందించానని ఇప్పటికి తనంటే సొసైటీలో మంచి గుర్తింపు ఉందన్నారు.నాకు న్యాయం చేయమని పోలీసులను ఆశ్రయిస్తే పోలీసులు భూ కబ్జాదారులకు సహకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు భూకబ్జా దారులకు పోలీసులు ఎలా సహకరిస్తారని ప్రశ్నించారు. గతంలో అదే సీఐ ఆదేశాల మేరకు తాడికొండ మీదుగా హైకోర్టుకు వెళ్లేపలువురు న్యాయమూర్తులకు రక్షణగా ఎస్కార్ట్ గా గౌరవ వేతనంలేకుండా వెళ్లేవాడినని గుర్తు చేసారు. తనపై నమోదు చేసిన కేసు పై న్యాయ విచారణ జరిపి దోషులు ఎవరనేది తెల్చి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కమిషన్ చైర్మన్ ను కోరినట్లు ఆయన వెల్లడించారు.

# పేదలకు నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యం

**– నగర కమిషనర్ అలీమ్ బాషా – అన్నా క్యాంటీన్లపై సమీక్ష**



**మంగళగిరి, మేజర్ న్యూస్:** అన్నా క్యాంటీన్ల పనితీరు మరింత సమర్థవంతంగా పారదర్శకంగా నిర్వహించాలని,మంగళగిరితాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ షేక్ ఆలీమ్ బాషా తెలిపారు. ప్రజలకు నాణ్యమైన భోజన సేవలు అందేలా పరిశుభ్రత, పర్యవేక్షణ, ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. మంగళవారం మంగళగిరితాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని అన్నా క్యాంటీన్ల పనితీరును మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్నా క్యాంటీన్ స్థాయి సలహా సంఘాల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో భోజన నాణ్యత, పరిశుభ్రత, సేవల వేగం, పర్యవేక్షణ విధానాలు, ప్రజల ఫిర్యాదుల పరిష్కారంపై చర్చ జరిగింది.రోజూ భోజన నాణ్యత తనిఖీ, క్యాంటీన్ ప్రాంగణంవంటగదిభోజన హాళ్లలో సంపూర్ణ పరిశుభ్రత, సమయానికి క్యాంటీన్ల ప్రారంభం, సీసీటీవీనీటి సదుపాయాల పర్యవేక్షణ, ప్రజల ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం, వృద్ధులుదివ్యాంగులుపేదలకు ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్ సూచించారు.ఈ సమావేశంలో కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ ధనేకుల వెంకట సుబ్బారావు, ఖాదీ బోర్డు డైరెక్టర్ యడ్లపల్లి సాంబ శివరావు , స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ అరుద్ర భూలక్ష్మి, ఏపీ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ గుడ్డంటి నాగేశ్వర రావు, యాదవ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ తాడిబోయిన భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# జగన్ హత్యా రాజకీయాలను మానుకోవాలి

**– ప్రజా తీర్పును గౌరవించి, బుద్ధి తెచ్చుకోవాలి – రాష్ట్ర బట్రాజు కార్పొరేషన్ చైర్మన్ సరికొండ**



**సత్తెనపల్లి మేజర్ న్యూస్ :** అధికారం కోల్పోయిన ఫ్రస్టేషన్ లో రాష్ట్ర లో హత్యాకాండలతో రప్పా రప్పా అంటూ విధ్వంసం సృష్టిస్తున్న వైసీపీ తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర బట్రాజు సామాజిక వర్గ అభివృద్ధి సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ సరికొండ వెంకటేశ్వరరాజు విమర్శించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. తుని నియోజకవర్గంలో అల్లెపూడి గ్రామానికి చెందిన టీడీపీ బీసీ నేత లాలం బంగారయ్య ని వైసీపీ నాయకులు కిరాతకంగా హతమార్చడం దారుణమన్నారు.వైసీపీ పార్టీ జగన్ రెడ్డి బిసి లకు చేసిన అన్యాయం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ కోత పెట్టడం వల్ల రాష్ట్రంలో 16000 పైగా బిసి లకు రాజ్యాంగ బద్ధమైన పదవులకు అన్యాయం జరిగిందని మండిపడ్డారు. బిసి సబ్ ప్లాన్ నిధులు దారిమళ్లింపుతో లక్షల కోట్ల రూపాయలు బిసి సోదరులకు అందకుండా చేసి ఆదరణ రద్దు చేశారని విమర్శించారు. వైసీపీ అధికారంలో వుండగా పల్నాడులో తోట చంద్రయ్య, జల్లాలయ్య యాదవ్ ని హత్య చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. బిసి లతో పెట్టుకుంటే జగన్ రెడ్డి జీవితం లో అధికారం లోకి రాలేవని, ప్రజా తీర్పుని గౌరవించి ఇప్పటికైనా నీ హత్య రాజకీయాలు మానుకోవాలి అని హెచ్చరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పూజల వెంకట కోటయ్య, సీతయ్య తదితరులు ఉన్నారు.

## టోల్గేట్ వద్ద అదుపు తప్పిన లారీ
# తప్పిన పెను ప్రమాదం



**మంగళగిరి మేజర్ న్యూస్:** మంగళగిరి మండలం కాజా టోల్గేట్ వద్ద ఓ లారీ అదుపు తప్పిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. సేకరించిన వివరాల మేరకు విజయవాడ నుండి కేరళ వైపు వెళ్తున్న ఓ లారీ బ్రేకులు ఫెయిలవడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. టోల్ ప్లాజా టోల్ ఫీజు వసూలు చేసే ఒక కౌంటర్ వద్ద ఏర్పాటు చేసిన డివైడర్ ని డీ కొట్టి ఆగిపోయింది. స్వల్పంగా టోల్గేట్ కు సంబంధించిన కొంత సామాగ్రి దెబ్బతింది.అలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో టోల్ ప్లాజా సిబ్బందితో పాటు వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.. ఈ ఘటన జరగడంతో టోల్ ప్లాజా వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ అయింది.

# శంకర్ విలాస్ ఫ్లైఓవర్, అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయండి
## నూతన కమిషనర్ కు బీజేపీ విజ్ఞప్తి



**గుంటూరు జిల్లా పరిషత్ మేజర్ న్యూస్:** గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మయూర్ అశోక్ ని బిజెపి జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది ఈసందర్భంగా తిరుపతిరావు కమిషనర్ తో మాట్లాడుతూ నగరంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, శంకర్ విలాస్ ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు త్వరితగతిన పూర్తి చేసి నగర ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అదేవిధంగా రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నగరంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని నగరంలో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు కమిషనర్ మయూర్ అశోక్ సానుకూలంగా స్పందిస్తూ సమస్యలను త్వరిత గతిన పరిష్కరించేలా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కమిషనర్ ను కలిసిన వారిలో జాతీయ స్పైసెస్ బోర్డ్ సభ్యులు కొత్తూరు వెంకట సుబ్బారావు బిజెపి సీనియర్ నాయకులు నేరెళ్ల మాధవరావు ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చరక కుమార్ గౌడ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట శ్రీనివాస్, పాండురంగ విఠల్, షేక్ రఫీ, జిల్లా ఉపాధ్యక్షులు సాధు రామకృష్ణ వంగిపురపు విమలాదేవి, కార్యదర్శులు కుందురు నాగేశ్వరరావు, నారాయణరెడ్డి, రాజేష్ నాయుడు, కారంశెట్టి రమేష్ వివిధ మోర్చాల అధ్యక్షులు ఎస్.కె. సాంబశివరావు, కొర్ర శ్రీనునాయక్, తుంగా యశ్వంత్ మండల అధ్యక్షులు కంచర్ల రాజేష్, మల్లాల లక్ష్మణ్, లంకా రవిశంకర్, శేగు నరేష్, మైలవరపు ప్రవీణ్, బాబురావు, రాయపూడి ఏసోబు, పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

# ఇస్తేమా నిర్వహణ కొరకు నిధులు కేటాయింపు పట్ల హర్షం
## జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు సయ్యద్ అమీర్ అలీ

**పిడుగురాళ్ల మేజర్ న్యూస్ :** ఇస్తేమా నిర్వహణ కొరకు కూటమి ప్రభుత్వం 1.25 ఒక కోటి ఇరవై ఐదు లక్షలు రూపాయలు కడపలో జరుగు మూడు రోజుల ఇస్తేమా కు నిధులు విడుదల చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతాభివందనములు తెలిపిన పల్నాడు జిల్లా మైనార్టీ అధ్యక్షులు సయ్యద్ అమీర్అలి ఈ మేరకు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. కడపలో ఈ నెల 23, 24, 25 తేదీల్లో జాతీయస్థాయిలో తబ్లిక్ జమాయత్ ఇస్తేమా నిర్వహణ కొరకు ముస్లింల పై ఎంతో ప్రేమ అభిమానములతో గౌరవనీయులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ఒక కోటి 25 లక్షల రూపాయలు కేటాయించినందుకు పల్నాడు జిల్లా మైనార్టీ భాగం తరపున,



మైనార్టీ సోదర, సోదరీమణులు తరపున హృదయపూర్వక కృతజ్ఞతాభివందనాలు తెలుపుకుంటున్నాను అన్నారు. 2014 - 19 తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కూడా ఇదే విధంగా నిధులు విడుదల చేసి ఉన్నారు. గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముందు నుండి కూడా ముస్లింల పక్షపాతి గతంలో ఎన్నో ముస్లిమ్ సంక్షేమ కార్యక్రమాల్ని అమలు చేసిన ఘనత ఆయనది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా ముస్లిం మైనార్టీలను అన్ని విధాలుగా ఆదుకొని, ముస్లింల రాజకీయ, సామాజిక అభివృద్ధికి తోడ్పడుతున్నందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి, కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను అని అన్నారు.